RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 205 మేడ్చల్ మల్కాజ్‌గిరి 17 ఆగష్టు 2024 శనివారం పేజీలు : 4

## 25 రాష్ట్రాలకు రెయిన్ అలర్ట్.. 3 నెలల్లో విధ్వంసం

గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా అనేక చోట్ల జోరు వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ 25 రాష్ట్రాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఈ క్రమంలోనే ఢిల్లీలో కూడా భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ ఎల్లో అలర్ట్ ప్రకటించింది. దేశ రాజధానిలో స్వాతంత్ర్య దినోత్సవం రోజున చాలా చోట్ల తేలికపాటి వర్షాలు కురిశాయి. మరోవైపు వాయువ్య భారతదేశంలోని జమ్మూ కశ్మీర్, లడఖ్, గిల్గిత్, ముజఫరాబాద్, పశ్చిమ రాజస్థాన్‌లలో శనివారం వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ క్రమంలో ఆగస్టు 21 వరకు ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్‌లలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఢిల్లీతో పాటు, హర్యానా, చండీగఢ్‌లకు కూడా ఎల్లో అలర్ట్ జారీ చేసింది.




## బీజేపీలో బీఆర్ఎస్ విలీనం వార్తలపై సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు

ఢిల్లీ: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలో.. మాజీ సీఎం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ పార్టీ విలీనం అవుతుందంటూ కొంతకాలంగా కాంగ్రెస్ ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ఊహాగానాలపై సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం జరుగుతుందని జోస్యం చెప్పారు. కేసీఆర్ గవర్నర్‌గా, కేటీఆర్ కేంద్రమంత్రిగా, హరీశ్ రావు అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఉంటారని అన్నారు. నాలుగు రాజ్యసభ సీట్లకు సమానంగా ఎమ్మెల్సీ కవితకు బెయిల్ ఇస్తారని వ్యాఖ్యానించారు. ఇక హైడ్రా ద్వారా నిర్మితమైన అక్రమ నిర్మాణాలను కూల్చివేసే ప్రక్రియ కొనసాగుతోందని, ఎందులో ఎలాంటి రాజకీయాలూ లేవని అన్నారు. రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చామని, హామీ చేసి చూపించామని అన్నారు. కాగా దేశ రాజధాని న్యూఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ఇతర అధిష్టానం పెద్దలను కలుస్తానని చెప్పారు. ఈ మేరకు మీడియాతో చిట్‌చాట్‌లో శుక్రవారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వర్గీకరణపై పార్టీ అగ్ర నాయకులు చెప్పిందే తాను చేశానని రేవంత్ రెడ్డి అన్నారు. వర్గీకరణపై తాము స్టాండ్ తీసుకున్నామని, దానికే కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. ఈ అంశంపై రాజకీయంగా తనకు ఒక స్టాండ్ ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాగా గురువారం రాత్రే సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ చేరుకున్నారు. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ కానున్నారు.

పార్టీలో తాజా పరిణామాలు, నూతన పీసీసీ అధ్యక్షుడి ఎంపిక, కేబినెట్‌లో కొత్తవారికి చోటు కల్పించడం సహా పలు ముఖ్యమైన అంశాలపై చర్చించనున్నారని సమాచారం. మరోవైపు రైతు రుణమాఫీ అంశాన్ని రాహుల్ గాంధీకి రేవంత్ వివరించనున్నారని తెలిసింది. మూడు విడతల్లో రైతులకు రుణమాఫీ చేసిన విధానానికి సంబంధించిన అంశాలను వివరిస్తారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.



## హైదరాబాద్‌లో పెట్టుబడులకు ఫాక్స్‌కాన్ ఛైర్మన్ సానుకూలత

న్యూఢిల్లీ : ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఫాక్స్ కాన్ ఛైర్మన్ యాంగ్ లియూ నేతృత్వంలోని ఫాక్స్ కాన్ ప్రతినిధి బృందం శుక్రవారం సమావేశమైంది. ఈ సంద ర్భంగా హైదరాబాద్ నగరానికి ఉన్న చరిత్ర.. పారిశ్రామిక సంస్థల విస్తరణకు ఉన్న అనుకూలత, అద్భుతమైన వాతావరణ పరిస్థితులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫాక్స్ కాన్ బృందానికి వివరించారు. 430 ఏళ్ల కింద పునాది రాయి పడిన హైదరాబాద్ కాలక్రమంలో మూడు నగరాలుగా అభివృద్ధి చెందిన తీరును ముఖ్యమంత్రి తెలియజేశారు.

**ఫోర్త్ సిటీపై సీఎం వివరణ..** ప్రభుత్వాలు మారినా పారిశ్రామిక అభివృద్ధిలో వైరుధ్యాలు లేకపోవడంతోనే హైదరాబాద్ వేగంగా పురోగతి చెందుతోందన్నారు.. ఆ అభివృద్ధిని మరింతగా పరుగులు పెట్టించేందుకే తాము ప్రస్తుత ప్రపంచ అవసరాలకు తగినట్లు ఫ్యూచర్ సిటీ పేరుతో నాలుగో నగరానికి (ఫోర్త్ సిటీ) రూపకల్పన చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ఫోర్త్ సిటీలో విద్యా, వైద్యం, క్రీడా, ఎలక్ట్రానిక్స్-ఎలక్ట్రికల్, స్కిల్ డెవలప్‌మెంట్ ఇలా బహుముఖంగా అభివృద్ధి చేయనున్నామని చెప్పారు. ప్రస్తుత ప్రపంచానికి అవసరమైన స్కిల్స్‌ను యువతకు అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ప్రారంభిస్తున్నామన్నారు.

**హైదరాబాద్‌లోని అనుకూలతలపై...** నవ తరం పరిశ్రమల అవసరాలు, వాటికి అవసరమైన నైపుణ్యాలు, భవిష్యత్తులో ఆయా పరిశ్రమల అవసరాలు తీర్చే మానవ వనరులను అందించేందుకు అవసరమైన సిలబస్ రూపకల్పనలో ప్రముఖ పారిశ్రామికవేత్తలను భాగస్వాములను చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే స్కిల్ యూనివర్సిటీకి ఆనంద్ మహేంద్రను ఛైర్మన్‌గా, మరో పారిశ్రామిక వేత్త శ్రీనివాస రాజును వైస్ ఛైర్మన్‌గా నియమించామని తెలిపారు. అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్), రీజినల్ రింగురోడ్డు (ఆర్ఆర్ఆర్)తో పాటు హైదరాబాద్‌కు ఉన్న అన్ని అనుకూలతలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారికి వివరించారు.

**అవసరమైన మద్దతు ఇస్తాం...** ఫోర్త్ సిటీలో ఫాక్స్ కాన్ సంస్థ పరిశ్రమలు పెట్టేందుకు అవసరమైన అన్ని అనుమతులు ఇవ్వడంతో పాటు అవసరమైన మద్దతు అందజేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫాక్స్ కాన్ ఛైర్మన్ యాంగ్ లియూకి హామీ ఇచ్చారు. ఫోర్త్ సిటీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. పారిశ్రామిక అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, అందిస్తున్న ప్రోత్సాహకాలు, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తమ బృందం అమెరికా, దక్షిణ కొరియాలో పర్యటించి దిగ్గజ పారిశ్రామిక సంస్థలతో జరిపిన చర్చలు, చేసుకున్న ఒప్పందాలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఛైర్మన్ యాంగ్ లియూకి వివరించారు.

## ప్రొ.కోదండరామ్ కు కీలక పదవి - ఢిల్లీ తాజా నిర్ణయం..!!




ఎట్టకేలకు ప్రొఫెసర్ కోదండరామ్ నిరీక్షణ ఫలించింది. తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొ.కోదండరామ్, అమీర్ అలీఖాన్‌లు శాసనమండలిలో అడుగుపెట్టారు. సుప్రీంకోర్టు తాజా నిర్ణయంతో వీరిద్దరికీ లైన్ క్లియర్ అయింది.

మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వీరితో ప్రమాణం చేయించారు. ఎమ్మెల్సీగా నియామకం పూర్తి కావటంతో ఇప్పుడు కోదండరామ్ కు కాంగ్రెస్ నాయకత్వం మరో బంపరాఫర్ ఇచ్చినట్లు సమాచారం. ఒకటి రెండు రోజుల్లోనే దీని పైన అధికారిక నిర్ణయం జరగనుంది.

**ఎమ్మెల్సీగా ప్రమాణం :** తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరామ్ ఎట్టకేలకు శాసనమండలి సభ్యుడయ్యారు. గవర్నర్ కోటాలో కోదండరామ్, అమీర్ ఆలీఖాన్ లతో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. గవర్నర్ కోటాలో ఈ ఇద్దరు ఎమ్మెల్సీలుగా బాధ్యతలను చేపట్టారు. తెలంగాణ ఉద్యమ సమయంలో జేఏసీ ఛైర్మన్ గా కీలక పాత్ర పోషించారు. కేసీఆర్ తో కలిసి ఉద్యమంలో కొనసాగారు. పలు నిరసన కార్యక్రమాల ద్వారా ఉద్యమ వేడిని పెంచారు. ఇక, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి.

**కాంగ్రెస్ నిర్ణయం...** కేసీఆర్ సీఎంగా ఉన్న కాలంలో కోదండరామ్ కు ప్రాధాన్యత దక్కలేదు. అలాంటి సమయంలో ప్రొఫెసర్ కోదండరామ్ కేసీఆర్ కు వ్యతిరేకంగా గళమెత్తారు. తెలంగాణ జనసమితి పేరుతో పార్టీని స్థాపించారు. ఆ పార్టీని కూడా ప్రజలు ఆదరించలేదు. 2023 ఎన్నికల్లో కోదండరామ్ కాంగ్రెస్ కు బేషరతుగా మద్దతు ఇచ్చారు. తన పార్టీ పోటీ చేయకుండా కాంగ్రెస్ కు మద్దతిచ్చిన ఆయనకు ఏదో ఒక పదవి ఇస్తామని పీసీసీ చీఫ్ గా రేవంత్ రెడ్డి మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే గవర్నర్ కోటాలో ఆయన పేరును సిఫార్సు చేసారు.

**మంత్రిగా ఛాన్స్...** బీఆర్ఎస్ నేతలు న్యాయస్థానం ఆశ్రయించటంతో ఎమ్మెల్సీగా నియామకం ఆలస్యం అయింది. ఇప్పుడు ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేయటంతో కోదండరామ్ చట్టసభల్లోకి అడుగు పెడుతున్నారు. ఇక, కాంగ్రెస్ ఎన్నికల్లో సహకరించిన కోదండరామ్ కు తగిన గుర్తింపు ఇవ్వాలని భావిస్తోంది.

అందులో భాగంగా ప్రస్తుతం ఆరు ఖాళీలు ఉన్న రాష్ట్ర మంత్రివర్గం విస్తరణకు సిద్ధమవుతోంది. ప్రొఫెసర్ కోదండరామ్ కు మంత్రిగా అవకాశం ఇవ్వాలని భావిస్తున్నట్లు సమాచారం. దీని పైన ముఖ్యమంత్రి రేవంత్ ఢిల్లీ పర్యటనలో అధికారికంగా స్పష్టత రానుంది.




## ముందు మా ప్రాణాలు కాపాడండి..

### తర్వాత రోగుల ప్రాణాలు కాపాడుతాం: నిమ్స్ వైద్యులు

హైదరాబాద్: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ నిమ్స్‌లో వైద్యులు, సిబ్బంది ఓపీ సేవలను బహిష్కరించారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. విధుల నిర్వహణలో రక్షణ కల్పించాలని వైద్యులు, సిబ్బంది నినాదాలు చేశారు. తమ నిరసన కారణంగా అత్యవసర సేవలకు ఆటంకం ఉండదని చెప్పారు. వైద్య సిబ్బంది రక్షణకు సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ తేవాలన్నారు. "ఏదైనా జరిగినప్పుడే పార్టీల నేతలు స్పందిస్తున్నారు. కొన్ని రోజుల తర్వాత అంతా మరిచిపోతున్నారు. డ్రాఫ్ట్ బిల్లులు ముందుకు తీసుకెళ్లాలని కోరుతున్నాం. ముందు మా ప్రాణాలు కాపాడండి.. తర్వాత రోగుల ప్రాణాలు కాపాడుతాం" అని వైద్యులు తెలిపారు.





## సీఎం రేవంత్ ఢిల్లీ టూర్ ఎఫెక్ట్

## రాష్ట్రంలో భారీ మార్పులేనా..!?

## మంగళవారం వరకు హస్తినలోనే రేవంత్!!

హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్ళారు. రాహుల్‌గాంధీ పిలుపు మేరకు వెళ్ళడంతో పీసీసీ చీఫ్ నియామకంపై చర్చించే అవకాశమున్నది. సీఎం రేవంత్, దీపాదాస్ మున్షీ, రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్, మల్లికార్జున్ ఖర్గే తదితరులు కొత్త పీసీసీ చీఫ్ నియామకంపై చర్చించి స్పష్టమైన నిర్ణయాన్ని తీసుకోనున్నారు. బలరాం నాయక్, మధుయాష్కీ గౌడ్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాల సమాచారం. ఎలాగూ మంగళవారం సాయంత్రం వరకు సీఎం రేవంత్ ఢిల్లీలోనే ఉంటున్నందున కేబినెట్ విస్తరణపైనా చర్చలు జరిగే అవకాశమున్నది. కానీ బీఆర్ఎస్ నుంచి పలువురు ఎమ్మెల్యేల చేరిక అంశంపై వేగాన్ని పెంచాలని ఏఐసీసీ నొక్కిచెప్పే అవకాశమున్నందన ప్రస్తుతం నలుగురిని మాత్రమే కేబినెట్‌లోకి తీసుకుని మరో రెండు స్థానాలను ఖాళీగా ఉంచే అవకాశాలున్నట్లు తెలిసింది. ఈ వారంలోనే ఐదారుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతారని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుల సమాచారం. ఏఐసీసీ కార్యవర్గంలోనూ భారీ స్థాయి మార్పులు చేయాలనే ఆలోచనలు ఉన్నందున రాష్ట్రం నుంచి జాతీయ అధికార ప్రతినిధిగా ఒకరికి అవకాశం ఇవ్వాలనే ప్రతిపాదన ఉన్నది. దీనిపై సీఎం రేవంత్‌తో మాట్లాడి ఎవరిని పంపిస్తారనే చర్చలు జరగనున్నట్లు తెలిసింది. మరోవైపు రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఉన్న సునీతారావ్ పదవీకాలం పూర్తికావడంతో కొత్త ప్రెసిడెంట్‌ను నియమించడంపై చర్చలు జరగనున్నాయి. ప్రస్తుతానికి సరితా తిరుపతయ్య పేరు వినిపిస్తున్నా ఈ సమావేశంలో చర్చల అనంతరం పేరు ఫైనల్ కానున్నది.

**ఫాక్స్ కాన్ ఛైర్మన్‌తో భేటీ :** రాష్ట్రంలో పెట్టుబడులపై విస్తృతంగా ప్రయత్నిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి... ఫాక్స్ కాన్ కంపెనీ ఛైర్మన్ యంగ్ లియూతో సోమవారం ఉదయం బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ నిర్వహించనున్నారు. . ఈ భేటీలోనే ఫాక్స్ కాన్, తెలంగాణ ప్రభుత్వం మధ్య అవగాహనా ఒప్పందం కుదరనున్నది. పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు, ఆ శాఖ స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్ ఈ సమావేశంలో పాల్గొంటున్నారు. ఇప్పటికే ఆ కంపెనీ యూనిట్ స్థాపన కోసం 200 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం గుర్తించింది.

ఈ యూనిట్ ద్వారా దాదాపు 25 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించవచ్చని తెలిసింది. దాదాపు 400 మిలియన్ డాలర్ల మేర పెట్టుబడితో సెమీ కండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ (ఓఎస్ఏటీ)ను ఫాక్స్ కాన్ నెలకొల్పడానికి ప్రయత్నిస్తున్నది.

గతంలోనే హెచ్‌సీఎల్ కంపెనీ భాగస్వామ్యంతో సెమీ కండక్టర్, చిప్ ఉత్పత్తి యూనిట్‌ను నెలకొల్పడంపై ప్రణాళికలు సిద్ధం చేసుకున్నది. గతేడాది కొంగరకలాన్‌లో 150 మిలియన్ డాలర్ల పెట్టుబడితో ఐ-ఫోన్లకు ఉపయోగపడే ఎయిర్ పాడ్స్ తయారీ యూనిట్‌కు శంకుస్థాపన జరిగింది.

ఆ తర్వాత గతేడాది నవంబరులో ఫాక్స్ కాన్ కంపెనీకి చెందిన 18 మంది ప్రతినిధుల బృందం హైదరాబాద్‌ను సందర్శించి డిస్‌ప్లే ఫ్యాబ్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ స్థాపనపై అధ్యయనం చేసింది. దీనికి కొనసాగింపుగా సీఎంగా రేవంత్ బాధ్యతలు తీసుకున్న తర్వాత గతేడాది డిసెంబరు 27న ఫాక్స్ కాన్ ఇండియా హెడ్ విన్సెంట్ లీ వ్యక్తిగతంగా కలిసి ఫ్యూచర్ ప్రాజెక్టులపై చర్చించారు. మొత్తంగా సుమారు లక్ష ఉద్యోగాల కల్పన దిశగా ఫాక్స్ కాన్ హైదరాబాద్‌లో కంపెనీ కార్యకలాపాలను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నది.

# సంపాదకీయం

## షర్మిల రాఖీ నారా లోకేష్ కేనా ?

వైఎస్ షర్మిలలో ఇంతటి మార్పుని వైసీపీ అభిమానులు సైతం జీర్ణించుకోలేకపోతున్నారు. ఆమెకు అన్న జగన్ కి మధ్య ఆస్తి తగాదాలు ఉండవచ్చు. అంతే కాదు ఆమె 2012 నుంచి 2019 దాకా వైసీపీ కోసం పడిన కష్టానికి అన్న నుంచి తగిన ప్రతిఫలం దక్కకపోవచ్చు. కానీ ఆమె అంతకు వేయింతలు అన్నట్లుగా ఏకంగా తండ్రి పేరిట ఏర్పాటు అయిన వైసీపీనే కూల్చేందుకు జగన్ కి రాజకీయ జీవితమే లేకుండా చేసేందుకు సాగిస్తున్న రాజకీయాన్ని చూసి వైసీపీ అభిమానులు తీవ్రంగా కలత చెందుతున్నారని ప్రచారం సాగుతోంది. ఉమ్మడి ఏపీ నుంచి రెండు పార్టీలు రెండు కుటుంబాలు అన్నట్లుగా వైఎస్సార్ నారా ఫ్యామిలీల మధ్య రాజకీయ యుద్ధం సాగుతోంది. ఆ ఇంటి మీద కాకి ఈ ఇంటి మీద వాలదు అన్న మాదిరిగానే ఈ కథ సాగుతోంది. షర్మిల సైతం 2023 రెండో అర్ధ భాగం దాకా అలాగే ఉంటూ వచ్చారు. ఆమె వైసీపీలో ఉన్నపుడు నారా కుటుంబాన్ని ఎన్నెన్ని మాటలు అన్నారో కూడా అంతా చూశారు. ఇదే లోకేష్ ని పట్టుకుని 2019 ఎన్నికల వేళ అ ఆ లు రాని వారు అగ్రతాంబూలం తనకే కావాలని అన్నాడంట. అలా ఉంది లోకేష్ తీరు. ఆయనకు అయిదు శాఖలను చంద్రబాబు ఇచ్చారు అని విమర్శించారు. జాబు రావాలంటే బాబు రావాలని ఊదరగొట్టిన చంద్రబాబు తీరా అధికారంలోకి వచ్చాక తన కొడుక్కే అయిదు కీలక శాఖలతో మంత్రి పదవి ఇప్పించుకున్నారు అని సెటైర్లు పేల్చారు. చంద్రబాబుకు ఒక ముని శాపం ఉందని ఆయన నిజం చెబితే తల వేయి ముక్కలు అవుతుందని అందుకే ఎపుడూ అబద్ధమే చెబుతారు అని కూడా షర్మిల ఘాటైన విమర్శలు వైసీపీ మహిళా నేతగా చేశారు. సీన్ కట్ చేస్తే ఆమె తన కుమారుడి వివాహానికి ఆహ్వానించడానికి అని చంద్రబాబు ఇంటికి వెళ్లారు. ఆయనతో చాలా సేపు మాట్లాడారు. దాని కంటే ముందు తెలంగాణాలో పార్టీ పెడతామని ఒక ఎల్లో మీడియాకు ఇంటర్వ్యూ ఇస్తూ చెప్పారు ఇక గత ఏడాది డిసెంబర్ లో క్రిస్మస్ శుభాకాంక్షలు ఆమె లోకేష్ కి చెప్పారు. ఇలా నారా కుటుంబంతో ఆమె తన అనుబంధాన్ని పెంచుకోవడం చూసిన వైసీపీ నేతలు ఏ మాత్రం జీర్ణించుకోలేకపోతున్నారు అని అంటున్నారు. అయితే రాజకీయాలు వేరు వ్యక్తిగతం వేరు అని షర్మిల ఎంత చెప్పినా ఏపీలో అలాంటి పరిస్థితులు లేవు అనే అంటారు. ఉంటే జగన్ ని పదహారు నెలలు బెయిల్ సైతం రాకుండా ఎలా జైలు గోడల మధ్యన ఉంచుతారు అని కూడా వైసీపీ నేతలు ప్రశ్నిస్తుంటారు. వైఎస్సార్ మరణానంతరం ఆ కుటుంబం రాజకీయాల్లో లేకుండా చేయడానికి టీడీపీ కాంగ్రెస్ తో చేతులు కలిపి జగన్ మీద కేసులు పెట్టించిన సంగతి మరచారా అని కూడా అడుగుతూ ఉంటారు. ఇవన్నీ ఇలా ఉంటే తాజాగా స్వాతంత్ర దినోత్సవ వేళ ఎట్ హెూం పార్టీకి షర్మిల కాంగ్రెస్ అధ్యక్షురాలి హెూదాలో వెళ్లారు. అక్కడ మంత్రి హెూదాలో నారా లోకేష్ ఉన్నారు. ఆయన షర్మిలను చూడగానే ఏమి తల్లీ బాగున్నావా అని ప్రశ్నించారు. దానికి బదులుగా షర్మిల బాగున్నా అన్నా అని బదులిచ్చారు. అంతే కాదు ఈ ఇద్దరూ చాలా సేపు మాట్లాడుకోవడం కూడా జరిగింది. దీంతో ఈ ఇద్దరూ మాట్లాడుకుంటున్న వీడియో బైట్ ని సోషల్ మీడియాలో టీడీపీ వారు పెట్టి అన్నా చెల్లెళ్ళు అంటే వీరే అన్నటుగా ప్రొజెక్ట్ చేశారు. ఇక జగన్ కి ఏమిటి దారి అని కూడా కామెంట్స్ చేస్తున్నారు. గత కొంతకాలంగా జగన్ కి రాఖీ కట్టడానికి షర్మిల రావడం లేదు. మరో మూడు రోజులలో రాఖీ పండుగ ఉన్న వేళ ఏమి అన్నా అని నారా లోకేష్ ని షర్మిల పలకరించిదని ఆమెకు అన్నగా లోకేష్ ఉన్నారు కాబట్టి ఆయనకే ఈసారి రాఖీ కడుతుందని కూడా నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి చూస్తూంటే షర్మిల టీడీపీ నేతలతో మరీ ముఖ్యంగా నారా కుటుంబంతో కలిసి మెలసి ఉండడాన్ని వైసీపీ నేతలు అయితే ఏ మాత్రం తట్టుకోలేకపోతున్నారు. అయితే ఆమె పార్టీ వేరు. కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఆమె వేరే పార్టీ నేతలతో మాట్లాడితే వైసీపీ నేతలకు ఎందుకు బాధ అన్న ప్రశ్నలూ ఉన్నాయి. మొత్తానికి చూస్తే వైసీపీకి షర్మిల మార్క్ షాకులు ఇంకా చాలానే ఫ్యూచర్ లో తగులుతాయని అంటున్నారు.

## మేడ్చల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ని ఆకస్మిక తనిఖీ చేసిన..మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతం



జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : రోగులకు సత్వరం చికిత్స అందించాలని వైద్యులకు సూచించిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్. శుక్రువరం రోజు జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు మేడ్చల్ మున్సిపాలిటీ పరిదిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను తనఖీ చేసినారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీధి కుక్కల బారిన పడిన బధితులకు సత్వర ట్రీట్మెంట్ చేసి ఏ ప్రాంతం నుండి కుక్క కాటు గురైన వచ్చిన వారు తెలుసుకొని ఆ ప్రాంతం గురించి వివరములు మున్సిపల్ కమిషనర్ కి తెలియజేయడం వలన ఆ ప్రాంతం వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ చేయించాలని మున్సిపల్ కమిషనర్ కు ఆదేశించినారు ఈ ప్రక్రియ వేగవంతం చేసి వీధి కుక్కలు, కోతులు భారీ నుండి ప్రజలను కాపాడే బాధ్యత మన అందరిదీ కావున వీధి కుక్కలు నుండి రక్షించుకోవడానికి కుక్కకాటుకు గురైనప్పుడు ప్రాథమికంగా తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలలో అవగాహన కల్పించాలని వాతావరణ పరిస్థితులు మారుతున్నందున సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా, డయేరియా, టైఫాయిడ్ జ్వరాలు వస్తుంటాయి. వాటర్, ఆహారము కలుషితం కాకుండా, మురుగు నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబందిత అధికారులను ఆదేశించారు. రాపిడ్ టెస్ట్ కిట్ట్ ద్వారా బ్లడ్ శాంపిల్స్ తీసుకొని పరీక్షించి తీవ్రతను బట్టి జ్వర నిర్ధారణ చేసి అత్యవసరమైన వైద్యసాయం అందించాలని, డెంగ్యూ జ్వరము మార్క్ చేసిన ప్రాంతంలో గుర్తించి మున్సిపల్ స్థాయి సిబ్బంది, గ్రామీణ స్థాయి సిబ్బంది ద్వారా దోమల వ్యాప్తి చెందకుండా ప్రతిరోజు ఫాగింగ్ చేయించాలని అధికారులను ఆదేశించినారు. దానికి తగ్గట్టు ఆసుపత్రిలలో కావలసిన మందులు, బెడ్లను, రాపిడ్



టెస్ట్ కిట్స్ ను అదనముగా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు, డెంగ్యూ జ్వరము వ్యాప్తి చెందకుండా ప్రత్యేకమైన వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు తక్షణ వైద్యం అందేటట్లు వైద్య అధికారులను ఆదేశించినారు. ఈ సందర్భముగా సమీకృత సలహా పరీక్ష కేంద్రంను, ఆయుష్ విభాగం, ఫార్మసీ, ల్యాబ్, ఇన్- పేషంట్ /ఔట్-పేషంట్ విభాగాలను పరిశీలించిన పిదప ల్యాబ్లో అవసరమైన ఆధునికమైన టెస్టింగ్ ఎక్విప్మెంట్ లను అందుబాటులో ఉంచుకొని ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయలను అందించాలని తెల్పినారు. ఈ కార్యక్రమములో పాల్గొన రఘునాథ్ స్వామి, జిల్లా వైద్య అధికారి, నాగి రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ కమిషనర్, వైద్య సిబ్బంది, సంబందిత అధికారులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ పేలు ప్రాంతాల్లో అంతరాయం

శామీర్ పేట, (గరుడ వార్త) : నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరా యం ఉండబోతోందని శామీర్ పేట విద్యుత్ ఏఈ సురేందర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేవరయంజాల్ విద్యుత్ సబ్ స్టేషన్ లో 11కేవీ పోతాయిపల్లి ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివా రం పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంట వరకు దేవరయంజాల్, పోతాయిపల్లి, ఎలిగల గూడ, వ్యవసాయ పొలాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కెవి మందాయి పల్లి ఫీడర్ మరమ్మత్తుల కారణంగా మందాయపల్లి గ్రామం, వ్యవసాయ పొలాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని శామీర్ పేట విద్యుత్ ఏఈ కోరారు.

## మద్యం మత్తు.. వదిలించేదెప్పుడు?



తాండూరు : జిల్లాలో గ్రామాలు..పట్టణాలు తేడా లేకుండా యువత మొదలు వృద్ధుల వరకు మద్యానికి బానిసలుగా మారుతున్నా రు. ప్రధానంగా యువత పుట్టినరోజులు, పండుగలు, శుభకార్యాల సమయంలో సంతోషం, సరదా పేరుతో మద్యం సేవిస్తున్నారు. క్రమంగా అలవాటుగా మారి బానిసలుగా మారుతున్నారు. వీరిని మద్యం మత్తు నుంచి విడిపించేందుకు 'డీ అడిక్షన్' (పునరావాస) కేంద్రం ఉన్నా నిరుపయోగంగా మారింది. నిర్వాహకులు ఎలాంటిచర్యలు తీసుకోవడంలేదని విమర్శలొస్తున్నాయి. దీనికి సంబంధించి కథనం.

బాధితుల్లో కూలీలు, కార్మికులే ఎక్కువ : తాండూరు ప్రాంతంలో అత్యధికంగా ఉన్న సిమెంటు, నాపరాయి పరిశ్రమల్లో దాదాపు 20,000 మందికి పైగా కారికులు, కూలీలు పనిచేస్తున్నారు. కూలినాలీ చేసి అలసిపోయిన ఉదయం, సాయంత్రం, రాత్రి ఇలా ప్రతిరోజు రెండు మూడు పూటలా మద్యం తాగుతున్నారు. చెమటోడ్చి సంపాదిం చిన సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారు. వెరసి ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ కలహాలు పెరిగిపోతున్నాయి.

మద్యం మాన్పించేందుకు..

మద్యం మాన్పించి జీవితాలను గాడిన పెట్టేందుకు కేంద్ర సర్కారు ద్వారా జిల్లాలో డీ అడిక్షన్ కేంద్రాన్ని తాండూరులో ఏళ్ల క్రితమే నెలకొల్పారు. కానీ మొక్కుబడిగా కొనసాగిస్తున్నారు. అరకొర సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. మద్యం మాన్పించేందుకు వచ్చే వారిని కేంద్రంలో ఉంచి కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు వ్యాయామం, ఆహారపు అలవాట్లతో మార్పు, మద్యపానం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాల్సి ఉంటుంది. నాలుగైదు వారాలపాటు కేంద్రంలోనే ఉంచి మెనూ ప్రకారం భోజనం, అల్పాహారం, తేనీరు వంటివి అందించాల్సి ఉంది. కానీ అమలుకు నోచుకోకపోవడంతో కేంద్రం లక్ష్యం నెరవేరడం లేదు. ఇదే విషయంపై కేంద్రం నిర్వాహకులు త్యాగరాజు మాట్లాడుతూ..కేంద్రం కొనసాగించేందుకు సకాలంలో నిధులు రావడం లేదని, మూడు నెలలకోసారి వస్తున్నాయని తెలిపారు. దీంతో నిర్వహణకు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

ఇవిగో.. ఉదాహరణలు తాండూరుకు చెందిన యువకుడు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో సీసీగా ఉద్యోగం చేస్తూ మద్యానికి అలవాటుపడ్డాడు. సంవత్సరాలు గడిచినా వ్యసనాన్ని మానుకోలేదు. విసుగు చెందిన భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. తాగుడుకు బానిసై ఉద్యోగానికి వాలంటరీ రాజీనామా చేశాడు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబాన్ని, చక్కటి జీవితాన్ని మద్యం మహమ్మారి హరించేసింది.

పట్టణానికి ఆనుకొని ఉన్న గ్రామంలో ఓ యువకుడు వ్యవసాయంతోపాటు మద్యం గొలుసు దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఫలితంగా కుటుంబ కలహాలు మొదలయ్యాయి. ఇటీవల మద్యం మత్తులో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పదిహేను సంవత్సరాల్లోపు పిల్లలు తండ్రిని కోల్పోవాల్సి వచ్చింది. వారి పోషణ తల్లి భుజాల మీద పడింది.

తాండూరు పరిధిలో ఇటీవల హమాలీ పనిచేసే ఇద్దరు తాగి మత్తులో పడిపోయారు. వారిలో ఒకడికి ముందుగా తెలివి వచ్చింది. వెంటనే తోటి కూలీ ఫోన్, డబ్బులు కాజేసి వికారాబాద్‌లో రైలు పట్టాలు దాటుతూ రైలు ఢీకొని దుర్మరణం చెందాడు.

## మున్సిపాలిటీ పార్కులో బహుళ అంతస్తుల భవనం!

హైదరాబాద్ : తప్పుడు సర్వే నంబర్లు.. నకిలీ వ్యక్తుల హాజరు.. పక్కాగా దస్తావేజులు.. హెచ్ఎండీఏ అనుమతులతో కొందరు కబ్జాదారులు దుండిగల్ మున్సిపాలిటీకి చెందిన పార్కు స్థలాల్లో బహుళ అంతస్తుల భవనాలను నిర్మించారు. వాటికి ఆస్తి పన్ను చెల్లిస్తున్నారు. హెచ్ఎండీఏ అనుమతులంటే పక్కాగా ఉంటాయనుకున్న మున్సిపల్ అధికారులకు కొద్దిరోజుల క్రితం స్థానికుల ఫిర్యాదుతో బహుళ అంతస్తుల భవనంతోపాటు 54 ఎకరాల లే-అవుట్‌లో పార్కుల కోసం కేటాయించిన మూడెకరా ఉన్నాయని తెలుసుకున్నారు. ఖాళీగా ఉన్న స్థలాల వద్ద బోర్డులు ఏర్పాటు చేసిన అధికారులు. బహుళ అంతస్తుల భవనం యజమానులకు తాఖీదులతో సరిపెట్టారు. ఉద్యానం కోసం కేటాయించిన భూమిలోనే నిర్మించారా?.. పట్టా భూమిలో నిర్మించారా?.. అన్న అనుమానం ఉండడంతో తాఖీదులతో సరిపెట్టామని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. అనుమానం ఉన్నప్పుడు రెవెన్యూ, హెచ్ఎండీఏ అధికారులను సంప్రదిస్తే తెలుస్తుందని స్థానికులు చెబుతున్నారు. పార్కుల భూమి విలువ రూ.90 కోట్లు ఉంటుందని స్థానికులు తెలిపారు.

తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్లు.. దుండిగల్ మున్సిపాలిటీ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములపై కన్నేసిన కొందరు కబ్జాదారులకు కేవీఆర్ లేఅవుట్‌లో పార్కుల భూములున్నాయని గుర్తించారు. ప్రైవేటు పట్టాభూముల సర్వే నంబర్లకు బై నంబర్లు వేసి ఆరేళ్ల క్రితం రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. తరువాత అప్పటి దుండిగల్ పంచాయతీలో ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్నారు. అక్కడ బహుళ అంతస్తుల భవనానికి అనుమతులు లేకపోవడంతో హెచ్ఎండీఏకు దరఖాస్తులు



సమర్పించి అనుమతులు తెచ్చుకున్నారు. వేగంగా బహుళ అంతస్తులు నిర్మించారు. డిజిటల్ సర్వే చేస్తే వాస్తవాలు వెలుగులోకి..

పార్కు స్థలాల్లో బహుళ అంతస్తుల నిర్మాణం నిగ్గు తేలాలంటే డిజిటల్ సర్వే నిర్వహించాలి. రెవెన్యూ రికార్డుల్లో సర్వే నంబర్లు, తాజా సర్వే నంబర్లను పోల్చడంతోపాటు ఆక్రమణల గుట్టు తేలే అవకాశాలున్నాయి. వాస్తవానికి ఇరవై ఏళ్ల క్రితం మల్లంపేట పరిధిలో ఇరవై ఏళ్ల క్రితం ఓ వ్యక్తి లే-అవుట్ వేశారు. ప్రజావసరాలు, ఉద్యానాల కోసం మూడెకరాల భూమిని గ్రామ పంచాయతీకి అప్పగించారు. ఐదేళ్ల క్రితం దుండిగల్ మున్సిపాలిటీ ఏర్పాటు కావడంతో ఆ భూములు మున్సిపాలిటీ పరమయ్యాయి. అయితే ఇప్పటికీ వాటిని పరిశీలించి సరిహద్దులు ఏర్పాటు చేయలేదు.

## పాన్ కార్డుతో బీమాకు ధీమా

కరీంనగర్ : ప్రమాదవశాత్తు మత్స్యకారులు మరణిస్తే ప్రభుత్వం అందించే బీమా పరిహారం పొందేందుకు ప్రభుత్వం కొత్త విధానం ప్రవేశపెట్టింది. మృతి చెందిన వారితోపాటు పరిహారం పొందే అర్హులైన కుటుంబ సభ్యులకు పాన్ కార్డు తప్పనిసరి ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ వివరాలు సమర్పించేందుకు జూన్ 30వ తేదీని చివరి గడువుగా విధించారు. పరిహారం పొందేందుకు బీమా పరిధిలోకి చేరే సభ్యులకు ప్రభుత్వం పలు అంశాలతో కూడిన విధానం అమలు చేస్తోంది. ఈ విషయం వివరాల సేకరణ కోసం మత్స్యశాఖ అధికారులు జిల్లాలోని మత్స్యకారుల సహకార సంఘాలకు వివరాలు పంపాలని ఆదేశాలు జారీ చేశారు.

ధ్రువపత్రాలు తప్పనిసరి..

గతంలో పాన్‌కార్డు లేకున్నా పరిహారం అందించే వారు. ప్రస్తుతం కొత్త విధానం ప్రకారం పాన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, వయస్సు, పుట్టిన తేదీ, గ్రామం, మండలం, జిల్లా వివరాలు, మత్స్యకారుడి ఆధార్‌కార్డు, బీమాలో చేర్చిన నామిని ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, చరవాణి నంబర్, తదితర వివరాలు తప్పనిసరి. వీటన్నింటినీ ప్రభుత్వం సూచించిన సైట్‌లో తప్పనిసరి నమోదు చేసుకోవాలి. ఈ కార్యక్రమం ఇప్పటికే జిల్లాలో కొనసాగుతోంది. ప్రధానమంత్రి మత్స్య బీమా యోజనతోపాటు రాష్ట్ర ప్రభుత్వ సీఎం మత్స్యయోజన అమలవతోంది. కొత్త విధానంలో నిబంధనలు పాటిస్తేనే పరిహారం అందనుంది.

మత్స్యకారుల బీమా యోజన..

మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో సభ్యులుగా ఉండి చేపలు పట్టి జీవించే మత్స్యకారులు ప్రమాదవశాత్తు మరణిస్తే ఇప్పటి వరకు సభ్యుడి పేరున బీమా ఉంటే వారి కుటుంబంలో అర్హులైన వారికి బీమా పరిహారం చెల్లించే వారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి బీమా యోజన పథకం అమలు చేస్తోంది. సంఘాల్లో సభ్యత్వం ఉన్న ప్రతి ఒక్కరికి ఇది వర్తిస్తుంది. బీమా ప్రీమియాన్ని సభ్యుల పక్షాన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తాయి. ఈ పథకంలో అర్హులైన సభ్యులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు, అంగవైకల్యం సంభవిస్తే రూ.2.5 లక్షలు, ప్రమాదంలో గాయపడితే రూ.25 వేలు ఇచ్చే విధానంలో బీమా పరిహారం రూపొందించారు.

కొత్త చిక్కులు!

పాన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ వివరాలు వంటివి మత్స్యకారులకు కొత్త చిక్కులు తెచ్చిపెడుతున్నాయి. చాలా మంది పాన్ కార్డులు పొందలేదు. దరఖాస్తుపై సంతకం చేయాల్సి ఉండగా.. కొద్దిమంది నిరక్షరాస్యులకు ఇది తలనొప్పిగా తయారైందని చెబుతున్నారు. నిబంధనలు కూడా కఠినంగా ఉన్నాయని వాపోతున్నారు. కొన్ని సడలించడంతోపాటు గడువు పెంచాలని సభ్యులు కోరుతున్నారు.

60 శాతం పూర్తి విజయభారతి, సహాయ సంచాలకులు, మత్స్యశాఖ జిల్లాలో బీమాకు సంబంధించి 60 శాతం సభ్యుల వివరాలు నమోదు చేశాం. ముందుగా సభ్యులందరి పేర్లు, వివరాలు పంపాలని కోరాం. పాన్ కార్డులు కూడా తీసుకోవాలని చెబుతున్నాం. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

జిల్లాలో ఇలా..

మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సంఖ్య : 189

సభ్యుల సంఖ్య : 14,989

చెరువులు : 809రిజర్వాయర్ : 1పెద్ద చెరువులు : 85రూ.అయిదు లక్షల బీమా పొందిన వారి సంఖ్య : 6

ఇంకా రావాల్సినవి : 38

## శాతవాహన విశ్వవిద్యాలయంపై చిన్నచూపు

కరీంనగర్ : రాష్ట్ర బడ్జెట్‌లో విశ్వవిద్యాలయాలకు కేటాయించిన నిధుల్లో ఒక్కో వర్సిటీకి రూ.30 కోట్ల వాటా ఉంటుంది. కానీ మంజూరయ్యే వరకు వాటికి గ్యారంటీ లేకుండాపోతోంది. పదేళ్లుగా బడ్జెట్‌లో విశ్వవిద్యాలయాలకు కేటాయింపులు తప్ప ప్రత్యేకంగా నిధులు ఇవ్వలేదు. విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించే ప్రాంగణ కేంద్రాలుగా వర్సిటీలు నిలుస్తాయి. నాణ్యమైన పట్టభద్రులను అందించడమే వీటి లక్ష్యం. మౌలిక వసతులు బాగున్నప్పుడే లక్ష్యం సిద్ధిస్తుంది. అలాంటి యూనివర్సిటీల్లో నిధుల లేమితో మౌలిక వసతులు కరవవుతున్నాయి. కరీంనగర్ కేంద్రంగా ఉన్న శాతవాహన విశ్వవిద్యాలయం మూడు ప్రాంగణాలతోనే కొనసాగుతోంది. ప్రధాన ప్రాంగణంలో చదువుకునే విద్యార్థుల వసతికి సరైన భవనాలు లేవు. మహిళా వసతిగృహంలో 450 మంది ఉండగా.. పురుష వసతి గృహంలో 150 మంది ఉన్నారు. ఒక్కో గదిలో అయిదారుగురు ఇరుకుగా ఉంటున్నారు.

**పెండింగ్‌లో మెస్ ఛార్జీలు..**

విద్యార్థుల మెస్ ఛార్జీలు రెండేళ్లుగా సుమారు రూ.2 కోట్ల వరకు విడుదల కావాల్సి ఉంది. వర్సిటీలో క్రీడల కోసం బహుళ ప్రాంగణం లేకపోగా.. ముగ్గురే పీఈడీలు ఉన్నారు. విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకోలేకపోతున్నారు. ఇతర ప్రాంగణమైన శాతవాహన



ఫార్మసీ కళాశాల విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కల మధ్య రేకుల గదుల్లో ఉండి చదువుకుంటున్నారు. మరో పీజీ కళాశాల గోదావరిఖనిలో ఉండగా.. అక్కడ ప్రాంగణమంతా చెత్తతో నిండి ఉంది. సరైన మూత్రశాలలూ లేవు. అక్కడ కేవలం ఇద్దరు విద్యార్థులే వసతిగృహంలో ఉంటున్నారు. అరకొర కేటాయింపులతో కేవలం బోధన, బోధనేతర సిబ్బంది జీతభత్యాలకే సరిపోతోంది. ఇక వర్సిటీల్లో అభివృద్ధి పనులు ఎలా ముందుకు సాగుతాయనేది ప్రశ్నార్థకంగానే మారింది.

**ప్రతిపాదనలు పంపిస్తున్నాం** శాతవాహన విశ్వవిద్యాలయంలో వసతిగృహాలు, స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. గత కొన్నేళ్లుగా కేటాయిస్తున్న బడ్జెట్ బోధన, బోధనేతర సిబ్బంది జీత భత్యాలకే సరిపోతుంది. మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. వరప్రసాద్, ఎస్‌యూ వర్సిటీ రిజిస్ట్రార్

## యువతా మేలుకో!

కరీంనగర్ : స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ కొత్త ఓటర్ల నమోదుకు శ్రీకారం చుట్టింది. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి అర్హులని ప్రభుత్వ యంత్రాంగం పేర్కొంటుంది. ఈనెల 20 నుంచి బూత్‌స్థాయి అధికారులు ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించనున్నారు. అర్హత కలిగిన వారిని ఓటర్లుగా నమోదు చేయడంతోపాటు అవసరమైన వారి చిరునామాను మార్చనున్నారు.



మృతుల వివరాలను జాబితానుంచి తొలగించి.. ఫొటో లేనివారివి చేర్చనున్నారు.

అవగాహన అవసరం..ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 29,80,447 మంది ఓటర్లు ఉన్నారు. రానున్న పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఆయా కళాశాలల యాజమాన్యం విద్యార్థులకు ఓటరు నమోదుపై విస్తృతంగా అవగాహన కల్పించాలి. దీంతో ఓటరు నమోదు శాతం పెరిగేందుకు అవకాశముంది. యువతీ, యువకులు బూత్ కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లోనూ అర్జీ చేసుకోవడానికి వీలుంది.

ఏటా వేల మంది అర్హత..డిగ్రీ, తత్సమాన కోర్సుల్లో ఏటా సుమారు 6 వేల మంది విద్యార్థులు చేరుతుంటారు. ఈ లెక్కన వేలమంది విద్యార్థులు ఓటు హక్కు అర్హత కలిగి ఉంటారు. కానీ నమోదు శాతం ఆ స్థాయిలో కనిపించడం లేదు. ఇటీవలి శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో చాలామంది ఓటరుగా నమోదు చేసుకున్నారు. త్వరలో జరగనున్న పంచాయతీ, మున్సిపల్, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ అదే తరహాలో యువత సద్వినియోగం చేసుకోవాలి.

## జిల్లాలో మరో 10 కొత్త పంచాయతీలు!

కరీంనగర్ : కరీంనగర్ జిల్లాకు మరో పది నూతన గ్రామ పంచాయతీలు ఏర్పాటు కానున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 313 ఉన్నాయి. ప్రజలకు మెరుగైన వసతులు, పాలనా సౌలభ్యం చేరువ కావడానికి రాష్ట్ర సర్కార్ కొత్త పంచాయతీలు ఏర్పాటు చేయనుంది. కిలోమీటరు వరకు విస్తరించి, జనాభా 500కు పైబడి ఉంటే ఆ పంచాయతీలోని విలీన గ్రామాలను విభజించి కొత్తవి ఏర్పాటు చేయాలని ప్రభుత్వం గతంలోనే సూచించింది. ఆ నిబంధనల మేరకు జిల్లాలో పది చోట్ల అవకాశముందని ఇటీవల గెజిట్‌ను విడుదల చేసింది. **323కు చేరనున్న సంఖ్య** జిల్లాలో ఇప్పటి వరకు 313 ఉండగా కొత్తగా పది ఏర్పాటుతో వాటి సంఖ్య 323 కానుంది. నాలుగు మండలాల్లో కొత్తవి ఏర్పాటు కానున్నాయి. హుజూరాబాద్‌లో 19 పంచాయతీలు ఉండగా 20కి, వి.సైదాపూర్ మండలంలో 26 ఉండగా, 29కి మానకొండూర్‌లో 27 ఉండగా 30కి, శంకరపట్నంలో 24 ఉండగా, 27కి చేరనున్నాయి. ప్రభుత్వ గెజిట్ ప్రకటన నేపథ్యంలో మరో వారం రోజుల్లో పూర్తి స్థాయిలో అధికార ఉత్తర్వులు వెలువడనున్నట్లు జిల్లా అధికార వర్గాలు పేర్కొన్నాయి.

# ఆడాలంటే.. సాహసమే!



పరిగి : క్రీడలు మానసికోల్లాసంతో పాటు దేహధారుడ్యత అందిస్తాయి. వీటి నిర్వహణతో యువతలో క్రీడాస్ఫూర్తిని కలిగించేందుకు గత ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీలో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. నిర్వహణ, పర్యవేక్షణ లోపంతో లక్ష్యం గాడి తప్పింది. దీంతో ఔత్సాహిక క్రీడాకారులు తీవ్ర నిరుత్సాహానికి లోనవుతున్నారు. జిల్లాలో నెలకొన్న ఈ పరిస్థితులపై 'పరిశీలనాత్మక' కథనం.

కనీసం నిల్చోవడం కూడా కష్టమే

మోమిన్‌పేట: మోమిన్‌పేట మండలంలోని ఎన్కెపల్లి, సయ్యదల్లిపురం, కేసారం, ఎన్కతల గ్రామాలలో ప్రభుత్వ స్థలంలో ప్రాంగణాలను ఏర్పాటుచేశారు. ఎన్కెపల్లిలో ప్రాంగణాన్ని గుట్ట అంచు భాగాన నిర్మించడం వల్ల క్రీడలు ఆడడం కాదుకదా నిల్చోవడానికి కూడా వీలు కావడంలేదు.

ఊరికి దూరంగా.. గుట్ట వెనుక ఏర్పాటు

కుల్కచర్ల: కుల్కచర్ల మండల కేంద్రానికి దూరంగా రెండున్నర కిమీ దూరంలో అది కూడ గుట్ట వెనుక భాగంలో ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని కనీసం ఒక్క రోజు కూడా ఎవరూ వినియోగించుకునే పరిస్థితి లేదు.

స్థలం ఉన్నా లేకపోయినా బోర్డు ఏర్పాటు

జిల్లాలోని పరిగి, కొడంగల్, వికారాబాద్, తాండూరు నియోజకవర్గాల్లో స్థల విస్తీర్ణాన్ని బట్టి ఒక్కో ప్రాంగణానికి రూ.2లక్షల నుంచి రూ.4లక్షల వరకు వెచ్చించారు. ఇంతవరకు బాగానే ఉన్నా పరికరాల, సౌకర్యాల కల్పనలో శ్రద్ధ చూపక పోవడంతో ఆటల నిర్వహణ అటకెక్కింది. అక్కడ స్థలం ఉన్నా లేకపోయినా బోర్డు ఏర్పాటు చేసి వదిలేశారు. జిల్లాలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రాంగణాల్లో అధికశాతం ఆడేందుకు వీలులేకుండా తయారయ్యాయి.

పరిగి మున్సిపాలిటీ పరిధిలోని జడ్పీహెచ్ఎస్ నం.1 పాఠశాల ఆవరణలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. కానీ కేవలం కొద్దిపాటి స్థలం మాత్రమే ఉండగా ఆడేందుకు కుదరడంలేదు.

యాలాలలో ఏకంగా కుంట సమీపాన ఏర్పాటు చేసి వదిలేశారు.

పరిగి మండలం కాళ్లాపూర్ గ్రామానికి క్రీడా ప్రాంగణాన్ని ఊరికి మూడు కి.మీ.దూరంలో ఏర్పాటు చేశారు.

మైదానంలో సిమెంటు వ్యర్థాలు

తాండూరు మండలంలో కరణ్‌కోట క్రీడా ప్రాంగణంలో సిమెంటు వ్యర్థాల సంచులు నిండియాయి. సంగెంకలాన్‌లో బోర్డులు పాతి మైదానంలో నాపరాళ్లను పరిచారు.

మొత్తం గ్రామ పంచాయతీలు- 566
క్రీడా ప్రాంగణాల మంజూరు - 566
పూర్తయినవి- 565
ఒక్కో దానికి వెచ్చించింది- రూ.2 నుంచి 4 లక్షలు
వినియోగంలో.. 100
కనీస పరికరాలు లేనివి.. 240

ఇవీ ప్రధాన సమస్యలు..
ఎగుడుదిగుడుగా స్థలాలు
రాళ్ల మధ్య ఏర్పాటు
కనీస పరికరాల కొరత
పెరిగిన ముళ్లపొదలు
పట్టించుకోని యంత్రాంగం

పంచాయతీలకు అప్పగించాం శ్రీనివాస్, డీఆర్డీఓ

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా నిర్మాణ పనులు చేపట్టి సంబంధిత పంచాయతీలకు అప్పగించాం. వాటి నిర్వహణ బాధ్యతను వారే చూసుకోవాల్సి ఉంది. మంజూరైన యూనిట్లు అనీ పూర్తిచేశాం. కిట్లు సరఫరా చేశాం హనుమంతరావు, జిల్లా యువజన క్రీడల అధికారి

యువతను క్రీడలవైపు దృష్టి మళ్లించే విధంగా ఉండేందుకు అన్ని పంచాయతీల ప్రాంగణాలకు కిట్లు కూడా సరఫరా చేశాం. మరో 200 క్రీడా కిట్లు మిగిలాయి. ప్రభుత్వ ఆదేశాలకు ఎదురు చూస్తున్నాం.

## కలల గృహం.. సమకూరితే సంబురం



తాండూరు: 'అసంపూర్తిగా ఉన్న రెండు పడక గదుల ఇళ్లనును పూర్తి చేయడానికి రూ.ఎన్నికోట్లయినా సరే వ్యయం చేస్తాం. పూర్తయిన ఇళ్లను అర్హులైన వారికి రెండు నెలల్లో అప్పగిస్తాం. ఈమేరకు పనులు పూర్తి చేయడానికి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించాం.' ఈ నెల 5న తాండూరు పర్యటనకు వచ్చిన రాష్ట్ర గృహనిర్మాణ, రెవెన్యూ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్న మాటలు ఇవి. ఈ నేపథ్యంలో జిల్లాలో ఇళ్లులేని నిరు పేదలు రెండు నెలల్లో పూర్తయ్యే రెండు పడక గదుల ఇళ్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

మొదటి దశలో 2,181 గ్రామాల్లో నిర్మాణం

జిల్లా వ్యాప్తంగా 2016లో గత ప్రభుత్వం 4,323 ఇళ్లను మొదటి దశలో 2,181 గ్రామాల్లో నిర్మించాలనుకుంది. అవసరాల మేర ఇళ్లను నిర్మించడానికి ప్రభుత్వ స్థలాలను కూడా గుర్తించింది. ప్రారంభంలో మంజూరు చేసిన ఇళ్లను దశల వారీగా విస్తరించాలనేది ఉద్దేశం. తాండూరు, వికారాబాద్ పట్టణాల్లో 2,142 రెండు పడక గదులను నిర్మించడానికి నిర్ణయం తీసుకుంది. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా నిర్ణీత రెండుపడక గదుల నిర్మాణాలకు కేవలం 1,763 ఇళ్లను ప్రారంభించి రూ.16 కోట్లను వ్యయం చేసింది. తాండూరు పట్టణం, కుల్కచర్ల మండలం అడవి వెంకటాపూర్‌లో కొన్ని ఇళ్లు పూర్తయ్యాయి. మోమిన్‌పేటలో పునాదులు దాటలేదు. మిగిలిన అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి.

రూ.3లక్షల ఆర్థిక సాయానికి నిర్ణయం

శాసన సభ ఎన్నికలకు ముందు భారాస ప్రభుత్వం రెండు పడక గదుల నిర్మాణాన్ని పట్టించుకోకుండా సొంత స్థలాలు ఉన్న పేదల ఇంటి నిర్మాణం కోసం రూ.3లక్షల ఆర్థిక సాయం చేయడానికి నిర్ణయించింది. ఆ మేరకు అర్హుల నుంచి గృహలక్ష్మి పథకం పేరిట 2023లో ద%రి%రఖాస్తులను ఆహ్వానిస్తే తాండూరు నుంచి 13,825, వికారాబాద్..15,796, కొడంగల్..14,548, పరిగి నుంచి 13,942 దరఖాస్తులు వచ్చాయి. 2023 నవంబరు 30న జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి డిసెంబరులో అధికారాన్ని చేపట్టింది. ఆ వెంటనే భారాస ప్రభుత్వంలో గృహలక్ష్మి కింద చేసుకున్న దరఖాస్తులను రద్దుచేసి ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు ఆహ్వానించింది.

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు 2,74,470

గత 2023 డిసెంబరు 28 నుంచి 2024 జనవరి 6వ తేదీ వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమానికి నిర్వహించింది. దీన్లో జిల్లా ప్రజలు మొత్తం 2,74,470 దరఖాస్తులను సమర్పించారు. ఇందులో 60 వేలకు పైబడి ఇందిరమ్మ ఇళ్లకోసమే ఉన్నాయని అంచనా. మిగిలినవి ఇతరత్రా అంశాలకు సంబంధించినవి. ప్రజాపాలనకు వచ్చిన దరఖాస్తులను ప్రస్తుతం కంప్యూటరీకరిస్తున్నారు. ఈనెల 17 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించినవి వరుస క్రమంలో చేపడతారని అధికారులు వివరిస్తున్నారు.

## చేయి చేయి కలిపి.. ఉచిత వైద్యానికి కదిలి

హైదరాబాద్: ఉస్మానియా, గాంధీ మెడికల్ కళాశాలల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్, ఏఎంపీఐ- యూఎస్ఏ సహకారంతో పాతబస్తీలోని షాహీన్‌నగర్ మసీదులో ఉచిత ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. ఇటీవలే అందుబాటులోకి వచ్చిన ఈ ఆసుపత్రిలో 20 పడకలు ఉండగా... అందులో అయిదు పడకలతో అత్యవసర విభాగం అందుబాటులోకి తెచ్చారు. టైఫాయిడ్, డెంగీ, గన్యా, డయేరియాతోపాటు గుండెపోటు బాధితులకు ఇక్కడ చికిత్సలు అందిస్తున్నట్లు హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ప్రతినిధి ముజ్తబా హసన్ అస్కారీ మంగళవారం మీడియాకు తెలిపారు. మసీదు మొదటి అంతస్తులో రెండు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆధునిక సౌకర్యాలతో ఈ ఆసుపత్రిని నెలకొల్పారు. ఆధునిక పరికరాలతోపాటు ఆక్సిజన్ పైపులైన్, పారా మానిటర్లు, డిఫిబ్రిలేటర్లు, నిపుణులైన వైద్యులు, నర్సులను అందుబాటులోకి పెట్టినట్లు తెలిపారు. కులమతాలకు అతీతంగా ఇక్కడ ఎవరైనా చికిత్స పొందవచ్చునన్నారు. 15 రోజుల నుంచి ఇప్పటివరకు 125 మంది రోగులకు రూ.75 లక్షల విలువైన వైద్య సేవలు ఉచితంగా అందించామని వివరించారు.



## కాడి పట్టేలా.. దృష్టి పెట్టాలె!

కొత్తగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యవసాయ ప్రధానమైనది. కానీ, ఇక్కడి యువత ఈ రంగానికి క్రమంగా దూరమవుతోంది. గిట్టుబాటు కాని సాగు కారణంగా చాలామంది కాడి పట్టడం లేదు. ఉపాధి వెతుక్కుంటూ పట్టణాలకు వలస వెళ్తున్నారని తాజా నివేదిక 'స్టేట్ ఆఫ్ రూరల్ యూత్ ఎంప్లాయ్‌మెంట్-2024' చెబుతోంది. జీవన భృతి కోసం చిరుద్యోగాలు చేస్తున్నారు. నచ్చిన వ్యాపారాల్ని కొనసాగిస్తున్నారు. మరికొందరు ప్రభుత్వ కొలువులే లక్ష్యంగా ఏళ్లతరబడి కుస్తీపడుతున్నారు. ఏటా పంట నష్టాల్ని మూటగట్టుకుంటున్న తల్లిదండ్రులు తమ పిల్లల్ని చదువు, ఇతర రంగాల వైపు ప్రోత్సహిస్తున్నారు. వ్యవసాయం దండుగ కాదు.. పండుగ అనేలా మార్పు తేవడం ప్రభుత్వ పెట్టుబడులు, ప్రోత్సాహంతోనే సాధ్యమని ఈ రంగం నిపుణులు చెబుతున్నారు.

సేద్యం చేసే భూమిని వ్యవసాయ కమతంగా పిలుస్తారు. విస్తీర్ణం పెరిగే కొద్దీ ఉపాంత, చిన్న, చిన్న మధ్య తరహా, మధ్య తరహా, పెద్ద కమతాలుగా విభజించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో అతి తక్కువ భూమి కలిగిన ఉపాంత రైతులే ఎక్కువ మంది ఉన్నారు. ఖమ్మం జిల్లాలో సగటు భూకమతం 0.91 హెక్టార్లు కాగా, భద్రాద్రి జిల్లాలో 1.30 హెక్టార్లుగా ఉంది. ఉపాంత, చిన్న కమతాల కారణంగా వ్యవసాయం లాభసాటి కావడం లేదు. దీంతో ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల్ని ఎంచుకుంటున్నారు. లేదా కౌలు రైతులుగా అవతారమెత్తి నష్టాలబారిన పడుతున్నారు. చిన్న కమతాలు పెరగడం, ప్రతికూల వాతావరణం, కుటుంబ పోషణకు ఆదాయం చాలకపోవడం వంటి



కారణాలతో నేటి యువత వ్యవసాయానికి దూరమవుతున్నట్లు ఇటీవలి అధ్యయనంలో తేలింది.

భద్రాద్రి జిల్లాలో వరి, పత్తి, కందితో పాటు వాణిజ్య పంటలైన ఆయిల్ పాం, మిరప, మామిడిలు ఎక్కువ విస్తీర్ణంలో ఉన్నాయి. ఖమ్మం జిల్లా మిరప, మొక్కజొన్న, పత్తి, కూరగాయల సాగుకు రాష్ట్రంలోనే ప్రసిద్ధి. ఆయా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతికి అపార అవకాశాలు ఉన్నట్లు ఇటీవల ప్రభుత్వం గుర్తించింది. ఆహార ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు, విత్తన తయారీ, ఉత్పత్తుల సేకరణ-ఎగుమతితో పంటలకు డిమాండ్ పెరిగితేనే.. యువత వారసత్వంగా వ్యవసాయాన్ని చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫుడ్ ప్రాసెసింగ్, అనుబంధ రంగాల్లో చిన్నతరహా యూనిట్ల ఏర్పాటుకు విస్తృత రుణ సదుపాయం కల్పించాలి. బ్యాంకులు, నాబార్డుల సాయంతో పాటు ఉపాధి పథకం నిధులను ఇందుకు భారీగా వెచ్చించాలి. వ్యవసాయ శాఖ యాంత్రీకరణ, ఆధునిక సాగు పద్ధతుల్ని చేరువేయాలి. వ్యవసాయ ప్రదర్శనల్ని విరివిగా ప్రోత్సహించాలి. మా కుటుంబం మూడు తరాలుగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తోంది. వచ్చే తరం వారు కాడి పట్టే పరిస్థితి లేదు. సాగులో పెట్టుబడి పెరిగింది. రసాయన మందులతో దిగుబడులు రావట్లేదు. పంటలకు గిట్టుబాటు ధరల్లేవు. వరి, సాగుకు బదులు కూరగాయలు, వాణిజ్య పంటలు సాగుచేసి కనీస ఆదాయం పొదుతున్నాను. వినూత్న పద్ధతుల్లో సాగు, ప్రభుత్వ ప్రోత్సాహంతోనే వ్యవసాయం లాభదాయకంగా ఉంటుంది. రాంబాబు, రైతు నాయకులగూడెం

## సెల్లార్లలో నిబంధనలకు చెల్లు

సత్తుపల్లి : పట్టణాల్లో బహుళ అంతస్తులు, వాణిజ్య సముదాయాల్లో వాహనాల పార్కింగ్‌కు వినియోగించాల్సిన సెల్లార్లను కొందరు యజమానులు అద్దె వనరులుగా మార్చుకుంటున్నారు. నిబంధనలు తోసిరాజంటూ అక్రమార్జనకు తెగబడుతున్నారు. కొందరు సెల్లార్లలో ఇష్టానుసారంగా గదులు నిర్మించి అద్దెలకు ఇస్తున్నారు. అయినా పట్టణ ప్రణాళిక విభాగం చోద్యం చూస్తోంది. అధికారులు నోటీసులు జారీచేసి చేతులు దులిపేసుకుంటున్నారు. ఖమ్మం కార్పొరేషన్‌లో పటిష్ఠ చర్యలను అమలు చేస్తున్నా.. ఇతర మున్సిపాలిటీల్లో మాత్రం కంటి తుడుపు చర్యలతో చేతులెత్తేస్తున్నారు.

**అక్రమార్జనే ధ్యేయం**

ప్రధానంగా ఆసుపత్రులు, వ్యాపార వాణిజ్య సముదాయాలు, పలు అపార్టుమెంట్లను పరిశీలిస్తే సెల్లార్‌లలో గదులు ప్రత్యక్షమవుతున్నాయి. ఆసుపత్రుల్లో రోగుల బంధువుల కోసం ప్రత్యేకంగా కుర్చీలు వేస్తూ,



రోగులకు పడక గదులు నిర్మిస్తూ, ల్యాబ్‌లనూ నిర్వహిస్తూ దర్జాగా సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో దుకాణాలు, స్టోర్ రూంల కోసం నిర్మాణలు చేపడుతున్నారు. సెల్లార్లను చూపించి అనుమతులు తీసుకోవడం.. ఆ తర్వాత ఉల్లంఘనలకు పాల్పడడం మామూలైంది. **వాహనాలు రోడ్లపైకి..** సెల్లార్లల్లో స్థలంలేక వాహనదారులు భవనాలకు ఎదురుగా రోడ్లపైనే అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. ఫలితంగా ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడుతున్నాయి. రోడ్లు ఇరుకై ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలతో మార్జిన్లలో నిలిపిన వాహనాలు ధ్వంసమవుతున్నాయి. **ఉల్లంఘనులకు నోటీసులు..** ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో అధికారులు 26 భవనాల్లోని సెల్లార్లలో అక్రమ నిర్మాణాలను గుర్తించారు. వీటిల్లో 20 చోట నిర్మాణాలు కూల్చివేయించారు. మిగతావారికి జరిమానాలు విధించారు. సత్తుపల్లిలో 8 బహుళ అంతస్తుల్లోని సెల్లార్లలో అక్రమ నిర్మాణాలను గుర్తించారు. నోటీసులను జారీ చేశారు. మరో నాలుగైదు భవనాలకు నోటీసులు ఇవ్వనున్నారు. మధిర పురపాలకంలోనూ రెండు బహుళ అంతస్తుల్లో అక్రమ నిర్మాణాలను గుర్తించిన అధికారులు నోటీసులను అందజేశారు.

**గడువులోగా స్పందించకుంటే చర్యలు**

శ్రీనివాసరావు, టీపీఎస్, సత్తుపల్లి

సత్తుపల్లిలో బహుళ అంతస్తుల్లోని సెల్లార్లలో చేపట్టిన అక్రమ నిర్మాణాలు తొలగిస్తాం. ఇటీవల యజమానులకు నోటీసులను అందించాం. మరోమారు అన్ని వార్డుల్లో తనిఖీలు చేస్తాం. గడువులోగా స్పందించకుంటే చర్యలు తీసుకుంటాం.

# దుమ్ము లేస్తోంది.. మురుగు నిలుస్తోంది!

హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారికి ఆనుకొని 1995లో 107 ఎకరాల విస్తీర్ణంలో మంఖాల్ పారిశ్రామిక వాడ ఏర్పాటైంది. 1998లో ప్లాట్లుగా విభజించి ఆయా పరిశ్రమలకు కేటాయించారు. 30 ఎకరాల స్థలాన్ని పెద్ద పరిశ్రమలకు, 36 ప్లాట్లను చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఇచ్చారు.

పారిశ్రామిక వాడలో ఎకరం స్థలాన్ని సుమారు రూ.6 లక్షల చొప్పున లబ్ధిదారులకు అప్పట్లో విక్రయించారు.

మంఖాల్ పారిశ్రామిక వాడలో 5.2 కి.మీ దూరం తారు రోడ్డును అప్పట్లో రూ.15 లక్షలతో నిర్మించారు.

ఇక్కడి పరిశ్రమలు.. 60 ట్యాంకర్ల నీటిని నిత్యం కొనుగోలు చేస్తున్నాయి. ఏడాదికి సుమారు రూ.కోటి ఖర్చు చేస్తున్నాయి. తాగునీటికి ఏటా రూ.60 లక్షలు వెచ్చిస్తున్నాయి.

ఆయా పరిశ్రమలు ఏటా రూ.80లక్షలు పన్నులు చెల్లిస్తున్నాయి. ఇవి టీజీఐఐసీకి 65శాతం, 35శాతం తుక్కుగూడ పురపాలికకు వెళున్నాయి. ఇక్కడ పనిచేసే కార్మికులకు తాగేందుకు నీరు అందుబాటులో లేదు. పీల్చేందుకు స్వచ్ఛమైన గాలి కరవే. వీధి దీపాలు లేక రాత్రి వేళ రాకపోకలకు ఇబ్బందులు తప్పట్లేదు. తుక్కుగూడ పురపాలక




పరిధిలో రెండున్నర దశాబ్దాల చరిత్ర కలిగిన మంఖాల్ పారిశ్రామిక ప్రాంతం.. ప్రస్తుతం సమస్యలతో సతమతమవుతోంది. ఏటా క్రమం తప్పకుండా పన్నులు కట్టించుకునే అధికారులు, పాలకులు.. కనీస సౌకర్యాలు కల్పించట్లేదు. ఫలితంగా పారిశ్రామిక ప్రాంతం అధ్వానంగా మారింది. కార్మికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

3 వేల మంది కార్మికుల కష్టాలు..

మంఖాల్ పరిధిలో హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారి చెంత 107 ఎకరాల్లో ఈ పారిశ్రామిక ప్రాంతం విస్తరించింది. రెండున్నర దశాబ్దాల కాలంలో అనేక పరిశ్రమలు స్థానికంగా ఏర్పాటయ్యాయి. వీటిల్లో ప్రస్తుతం 3వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఆయా పరిశ్రమలు ఏటా రూ.80 లక్షలు పన్ను చెల్లిస్తున్నా.. శ్రమజీవులకు కనీస వసతులు కల్పించలేదు. వీధి దీపాలు లేక కార్మికులు రాత్రి సమయాల్లో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రెండున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన రహదారులు.. ప్రస్తుతం అధ్వానంగా తయారయ్యాయి. నిత్యం ట్యాంకర్లు తిరగడంతో రోడ్లు గోతులతో దర్శనమిస్తున్నాయి. కాల్వలు లేక చిన్న వాన వచ్చినా రహదారులపై నీరు నిలిచిపోతోంది. పారిశ్రామిక వాడలో కనీస వసతులు కల్పించాలని కార్మికులు కోరుతున్నారు.

# కాలువ కోతతో రైతుల పరేషాన్

మంథని: మంథని మండలంలోని చందనాపూర్ చెక్‌డ్యాం కాలువ కోతకు గురై పంట భూములకు సాగు నీరు అందడం లేదు. మంథని–రామగిరి మండలాల సరిహద్దులో చందనాపూర్ వాగుపైన చెక్‌డ్యాం నిర్మించారు. గత ఏడాది వరదలకు జల్లారం వాగు చెక్‌డ్యాం తూం పక్కన ఉన్న కాలువ కోతకు గురైంది. దీంతో చెక్‌డ్యాం కుడి కాలువకు నీరు రాక 200 ఎకరాలకు సాగు నీరు అందలేదు. జల్లారం గ్రామ శివారులోని భూములను సింగరేణి స్వాధీనం చేసుకుంది. సంస్థ అభివృద్ధి పనుల కోసం జల్లారం వాగును మళ్లించారు. వాగు నీటిని మళ్లించడంతో మూల మలుపుతో ఉద్ధృతంగా వచ్చిన వరదతో చెక్‌డ్యాం కాలువ కోతకు గురైందని రైతులు ఆరోపిస్తున్నారు. కాలువ కోతకు గురికావడంతో చెక్‌డ్యాంపై ఉన్న భూముల్లో వరద నీరు రావడంతో సుమారు 10 ఎకరాల భూముల్లో ఇసుక మేటలు వేసి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కాలువ పక్కన ఉన్న భూముల్లోనూ ఇసుక మేటలు వేశాయి. రైతులకు జరిగిన నష్టానికి సింగరేణి బాధ్యత వహించి కాలువను పునరుద్ధరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ



విషయమై నీటి పారుదల శాఖ డీఈఈ రమేష్‌బాబును వివరణ కోరగా.. చెక్‌డాం కాలువ కోతకు గురైనట్లు రైతులు సమాచారం ఇవ్వలేదన్నారు. క్షేత్ర స్థాయిలో వెళ్లి పరిశీలిస్తామన్నారు.

**పంటలు పండని పరిస్థితి నెలకొంది**

కాలువ కోతకు గురికావడంతో కాలువ నీరు రాక పంటలు పండని పరిస్థితి నెలకొంది. కోతకు గురై ఏడాది కావస్తున్నా అధికారులు కాలువ మరమ్మతులు చేపట్టడానికి చర్యలు తీసుకోవడం లేదు. సింగరేణి సంస్థ వాగును మళ్లించడంతోనే కాలువ కోతకు గురైంది. వెంటనే కాలువకు మరమ్మతులు చేపట్టాలి.

కుమరి పోచం, దబ్బపల్లి

ఇసుక మేటలతో నష్టపోయాం

చెక్‌డ్యాం కాలువ కోతకు గురి కావడంతో వరదనీరు కాలువ పైభాగంలో ఉన్న పంట భూముల్లోకి వచ్చాయి. ఇసుక మేటలు వేయడంతో తీవ్రంగా నష్టపోయాం.

యెర్రవెల్లి నర్సింగారావు, దబ్బపల్లి

# అడిగినంత ఇస్తే.. ఆ భూములు మీకే



హైదరాబాద్: రంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ భూములు అవినీతి అధికారులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. రూ.వందల కోట్ల విలువైన సర్కారు భూములను అమ్యామ్యాలు పుచ్చుకొని అక్రమార్కులకు అప్పగిస్తున్నారు. నిబంధనల ప్రకారం నిషేధిత జాబితాలోని భూములను రిజిస్ట్రేషన్ చేయకూడదు. రెవెన్యూ శాఖలో కీలక అధికారులకు రూ.కోట్లలో ముట్టజెప్పడంతో సదరు భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తున్నారు. జిల్లాలో నిషేధిత భూములను జాబితా నుంచి తొలగించడానికి ఆ జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరకడం చర్చనీయాంశంగా మారింది.

**డిజిటల్ సంతకానికో ధర..**

రంగారెడ్డి కలెక్టరేట్‌లో ఫైళ్లపై డిజిటల్ సంతకాలు చేయాలంటే రూ.లక్షల్లో ముడుపులు చెల్లించాల్సిందే. ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్, చేవెళ్ల రెవెన్యూ డివిజన్లలోని కొన్ని కార్యాలయాల్లో డిజిటల్ సంతకం విలువ భూముల రేట్ల ఆధారంగా మారుతుంటుంది. ఆయా కార్యాలయాల్లో రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలు ఇస్తేనే డిజిటల్‌సంతకాలు వస్తాయి.

ఓ సర్వే నెంబర్‌లోని ఒక ఎకరమో.. రెండెకరాలో వివాదం ఉండి కోర్టుకు వెళితే.. కోర్టు ఆ రెండు ఎకరాల్లో క్రయ విక్రయాలు జరగకుండా ఆదేశాలు జారీ చేస్తుంది. అధికారులు మాత్రం ఈ రెండు ఎకరాలతోపాటు సర్వే నెంబర్‌లో మిగిలిన భూమిని నిషేధిత జాబితాలో పెడుతున్నారు. తమ భూములను జాబితా నుంచి తొలగించాలని బాధితులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

ధరణి పోర్టల్ తెరిపించి..ఎన్నికలకు ముందు ఇటువంటి భూ అక్రమాలే రంగారెడ్డి జిల్లాలో పెద్దఎత్తున జరిగాయి. కలెక్టరేట్‌లో ధరణి పోర్టల్ నిర్వహిస్తున్న ఇద్దరు పొరుగుసేవల సిబ్బంది నిషేధిత జాబితాలో ఉన్న వందల ఎకరాలను దరఖాస్తుదారులకు అనుకూలంగా మార్చేశారు. అప్పటి కలెక్టర్ ధరణి పోర్టల్ తెరిపించి ఓకే చేయించారనే ఆరోపణలు వచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత కలెక్టర్‌ను బదిలీ చేశారు.

కలెక్టరేట్‌లోని రెండు విభాగాల్లో ఇద్దరు, ముగ్గురు అధికారులు ధరణి పోర్టల్‌లో లోపాలకు సంబంధించిన వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు. కొన్ని భూములకు సంబంధించి తహసీల్దార్ కార్యాలయాలు నివేదిక ఇచ్చినా.. కొందరు ఉద్యోగులు తమకు అమ్యామ్యా అందనిదే.. సంబంధిత ఫైల్ ఆన్‌లైన్‌లో క్లియర్ చేయడం లేదు.

మండల స్థాయిలో కొందరు రెవెన్యూ అధికారులు ప్రైవేటు వ్యక్తులను ఏజెంట్లుగా నియమించుకుంటున్నారు. వివాదాస్పద భూముల యజమానులు వచ్చి ఏజెంట్లతో రేటు మాట్లాడుకుంటే చాలు ఫైలు ఓకే అవుతుంది. అన్ని స్థాయిల్లోని అధికారులకు వాటాలు అందుతాయి. రాజేంద్రనగర్, ఇబ్రహీంపట్నం, చేవెళ్ల రెవెన్యూ డివిజన్ల పరిధిలోని పలు తహసీల్దార్ల కార్యాలయాల్లో ఇలాంటివి రోజూ జరుగుతుండడం బహిరంగ రహస్యమే.

# శీలానికి వెలకట్టిన కామాంధుడు



హైదరాబాద్ : ఇల్లు గడవక తండ్రితో కలిసి పనికి వెళ్లిన గిరిజన బాలిక (13)పై ఓ కామాంధుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక గర్భం దాల్చింది. దాదాపు అయిదు నెలలు ఈ నరకాన్ని అనుభవించాక విషయం బయటకు పొక్కడంతో ప్రబుద్ధుడు మరో అడుగుముందుకేసి బాలికకు గర్భస్రావం చేయించాడు. బాధితులకు ఎంతో కొంత ఇచ్చేలా రెండు గ్రామాల పెద్దలతో పంచాయితీ పెట్టించి రాజీ చేయాలనుకున్నాడు. డబ్బుకు లొంగని బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం..

**పనికొచ్చినప్పుడు కన్నేసి ఘాతుకం**

శంషాబాద్ మండలంలోని ఓ తండాకు చెందిన దినసరి కూలీకి 13 ఏళ్ల కుమార్తె ఉంది. భార్య కొన్నేళ్ల కిందట ఇంటి నుంచి వెళ్లిపోవడంతో తండ్రి మరో వివాహం చేసుకున్నారు. నిరుపేద కుటుంబం కావడంతో బాలిక తండ్రితో పాటే సమీప గ్రామంలోని పలుకుబడి ఉన్న వ్యక్తి భూమిలో వ్యవసాయ పనులకు వెళ్తోంది. బాలికపై కన్నేసిన యజమాని (30) ఆమెను లొంగదీసుకుని భయపెట్టి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇతనికి భార్య, కుమారుడు ఉన్నారు. యాజమానికి పలుకుబడి ఉండడంతో బాలిక భయపడి నోరువిప్పలేదు. దీన్ని అవకాశంగా తీసుకున్న ప్రబుద్ధుడు పలుమార్లు ఆకృత్యాన్ని కొనసాగించడంతో బాలిక గర్భం దాల్చింది. దాదాపు అయిదు నెలలు నరకాన్ని అనుభవించింది. తాజాగా ఆమెలో శారీరక మార్పులు కనిపించడంతో కుటుంబ సభ్యులు ప్రశ్నించినప్పుడు గర్భం దాల్చిన విషయం చెప్పింది. అప్పుడే భూయజమాని తన పలుకుబడిని ఉపయోగించాడు.

**పెద్ద మనుషులతో పంచాయితీ..**

బాలిక గర్భం దాల్చిన విషయాన్ని యజమాని దగ్గర కుటుంబ సభ్యులు ప్రస్తావించారు. 'మీరు ఈ విషయాన్ని ఎవరికీ చెప్పొద్దు. అంతా నేను చూసుకుంటా' అంటూ బాలికను కొత్తూరు మండల కేంద్రానికి తీసుకెళ్లాడు. బాలిక ప్రాణానికి ముప్పు ఉంటుందని తెలిసినా పట్టించుకోకుండా వైద్యురాలికి డబ్బిచ్చి ఒక గదిలో రహస్యంగా గర్భస్రావం చేయించాడు. ఈ విషయం బయటకు పొక్కకుండా మంగళవారం తన వ్యవసాయ క్షేత్రంలో తండా, గ్రామ పెద్దలను కూర్చోబెట్టి డబ్బులిచ్చి రాజీ కుదిర్చే ప్రయత్నం చేశాడు. అయితే బాలిక కుటుంబసభ్యులు డబ్బులకు లొంగకుండా మంగళవారం సాయంత్రం శంషాబాద్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

# స్థలమున్నా.. నిధులే సమస్య!



కోరుట్ల :జిల్లాలోని కోరుట్ల, మెట్‌పల్లి డివిజన్ కేంద్రాల్లోని ముఖ్యమైన ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. ఏళ్ల తరబడి అద్దె, శిథిలావస్థ భవనాల్లోనే కొనసాగుతున్నాయి. కోరుట్ల పట్టణంలో ప్రభుత్వ స్థలాలు ఉన్నప్పటికీ సొంత భవనాల నిర్మాణాలకు నిధుల కొరత ఉంది. మెట్‌పల్లి పట్టణంలో పాతభవనాల్లోనే డివిజన్ కార్యాలయాలను నెలకొల్పారు. నిత్యం రద్దీగా ఉండే ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు.

**17 ఏళ్లుగా..**

కోరుట్లకు 2007లో రవాణాశాఖ ఉప కార్యాలయం మంజూరు కాగా ఆదర్శనగర్‌లోని ఓ అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. 17 ఏళ్లుగా అద్దె భవనంలోనే కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. కోరుట్ల రవాణాశాఖ పరిధిలో కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలు, కథలాపూర్, మేడిపల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాలు ఉన్నాయి. అద్దె భవనంలో కనీస సౌకర్యాలు కరవయ్యాయి. నిత్యం డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల రిజిస్ట్రేషన్, ఇతర పనుల కోసం వందల మంది వస్తుంటారు. వాహనాల సామర్థ్యం, ట్రాక్ సౌకర్యం లేక ఆరుబయట ప్లాట్లలో ఏర్పాటు చేశారు. ఎండకు, వానలకు ఎంవీఐ, సిబ్బంది, ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. సొంత భవన నిర్మాణానికి రెండేళ్ల కిందట రామారావుపల్లెరోడ్‌లో 2.20 గుంటల ప్రభుత్వ భూమిని కేటాయించారు. ఆస్థలం ట్రాక్ నిర్మించేందుకు అనువుగా లేకపోగా, భవన నిర్మాణానికి కావాల్సిన నిధులు కేటాయించకపోవడంతో వదిలేశారు.

**స్థలం కేటాయించినా..**

కోరుట్లకు 2014లో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరుకాగా సి.ప్రభాకర్ స్మాకర గ్రంథాలయంపైన ఏర్పాటు చేశారు. కోర్టు పరిధిలోకి కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి మండలాలు వస్తాయి. కోర్టుకు వచ్చిన కక్షిదారులు, న్యాయవాదులు, పోలీసు సిబ్బంది ఉండేందుకు కనీస వసతులు లేకపోవడంతో ఏళ్ల తరబడి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఏడాదిన్నర కిందట నూతన భవనంలోకి కోర్టును మార్చారు. నెలకు రూ.50వేల చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. కోరుట్ల కోర్టుకు శాశ్వత భవనం, న్యాయమూర్తి నివాస గృహం, ఇతర నిర్మాణాలు చేపట్టేందుకు 2016లో మెట్‌పల్లిరోడ్‌లో 2 ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించినా ఇప్పటివరకు ఎలాంటి నిధులు మంజూరుకాలేదు.

రెవెన్యూ భవనంలో సబ్ కలెక్టర్ కార్యాలయం

మెట్‌పల్లి డివిజన్ కేంద్రంగా ఏర్పడిన తర్వాత సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని మండల రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఇక్కడ ఉన్న రెవెన్యూ కార్యాలయాన్ని స్త్రీశక్తి భవనంలోకి మార్చారు. పాత రెవెన్యూ కార్యాలయ భవనం నిర్మించి సుమారు 40 ఏళ్లు గడుస్తోంది. ఈ భవనానికే కొద్దిపాటి మరమ్మతు చేసి సబ్‌కలెక్టర్ కార్యాలయం నిర్వహిస్తున్నారు. డివిజన్ పాలనకు కేంద్రమైన సబ్‌కలెక్టర్ కార్యాలయానికి సొంత భవనం నిర్మాణంపై దృష్టిసారించడం లేదు.

**ఈ–సేవ కేంద్రంలో డీఎస్పీ..**

మెట్‌పల్లి మండల పరిషత్ ఆవరణలోని ఈ–సేవ కేంద్ర భవనంలో డీఎస్పీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఓ గది, ఒక హాలు మాత్రమే ఉండడంతో అధికారులు, సిబ్బంది అందులోనే విధులు నిర్వర్తిస్తున్నారు. వివిధ పనుల నిమిత్తం వచ్చే డివిజన్ పోలీసులు, ప్రజలకు ఇక్కడ సౌకర్యాలు లేక ఇబ్బందులు తప్పడం లేదు.

మెట్‌పల్లిలో వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయం ఏళ్లుగా మెట్‌పల్లి మండల పరిషత్ ఆవరణలో రేకుల షెడ్డులోనే కొనసాగుతోంది. ఏవో, ఏడీఏ కార్యాలయాలు ఒక్కచోట చిన్న చిన్న గదుల్లో నిర్వహిస్తున్నారు. రైతులతో సమావేశాలు నిర్వహించిన సమయంలో అవస్థలు ఎదురవుతున్నాయి.మెట్‌పల్లి ఐసీడీఎస్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. కోరుట్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు వేములవాడ నియోజకర్గంలోని కథలాపూర్, మేడిపల్లి మండలాల అంగన్‌వాడీ కేంద్రాలు దీని పరిధిలో ఉండగా, కార్యకలాపాలకు, సమావేశాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.మెట్‌పల్లి ఆబ్కారీ శాఖ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి.డివిజన్ కేంద్రంగా ఏర్పడ్డ తర్వాత కోరుట్ల, మెట్‌పల్లిలో డివిజన్ పంచాయతీ అధికారి కార్యాలయం లేదు.కోరుట్లలో నీటిపారుదలశాఖకు సొంత భవనం లేదు. ఐబీ గెస్ట్‌హౌజ్‌లోనే కార్యాలయం ఏర్పాటు చేసుకొని విధులు నిర్వహిస్తున్నారు.

# పాతబస్తీ మెట్రో మార్గంలో మరో అడుగు

హైదరాబాద్: రాజధాని నగరం.. పాతబస్తీ మెట్రో మార్గంలో కీలక అడుగు పడింది. పుష్కర కాలంగా అపరిష్కృతంగా ఉన్న మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి ఆస్తుల సేకరణ ప్రక్రియ ఎట్టకేలకు మొదలైంది. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మార్గంలో సేకరించిన ఆస్తుల్లో తొలుత 200 ఆస్తులకు సంబంధించి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ తాజాగా నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రాంతాలవారీగా వీటిని జారీ చేస్తున్నారు. 25 ఆస్తులకు సంబంధించి ఒక ప్రకటనగా ఇచ్చారు.

పాతబస్తీ మెట్రోకు సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు మార్చిలో శంకుస్థాపన చేశారు. 7.5 కి.మీ. మార్గానికి రూ.2675 కోట్లు అవుతుందని అంచనా. బడ్జెట్‌లో రూ.500 కోట్లు ప్రతిపాదించారు. ఈ మార్గంలో ఎంజీబీఎస్‌నుంచి ఫలక్‌నుమా వరకే 1100 ఆస్తులను సేకరించాల్సి ఉంటుందని గతంలో గుర్తించారు. ఇప్పుడు ఈ మార్గాన్ని ఫలక్‌నుమా నుంచి చాంద్రాయణగుట్ట వరకు పొడిగించారు. సేకరించాల్సిన ఆస్తుల జాబితా మరింత ఎక్కువగా ఉంటుంది. ఆస్తుల



సేకరణకు ఆగస్టు 3న వేర్వేరుగా 8 నోటిఫికేషన్లు ఇచ్చారు. ఇందులో 200 వరకు ఆస్తులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీటికి సంబంధించి 20వేలకు పైగా చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆస్తులు సేకరించాల్సి ఉంటుంది. యజమానులకు అభ్యంతరాలు ఉంటే రెండు నెలల వ్యవధిలో మెట్రోరైలు కార్యాలయంలో భూసేకరణ అధికారికి తెలపవచ్చు. మిగిలిన ఆస్తులకు సంబంధించి ముమ్ముందు దశలవారీగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్లు జారీ చేయనున్నారు. ఆస్తుల జాబితాను మెట్రో అధికారులు ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమర్పిస్తున్నారు.

80 అడుగులు ఉండేలా..: మెట్రో కోసం రహదారి వెడల్పు 80 అడుగులు ఉండేలా విస్తరించనున్నారు. స్టేషన్లు నిర్మించే చోట 120 అడుగుల రహదారి ఉండేలా ఆస్తుల సేకరణ చేస్తున్నారు. ఈ మార్గంలో 6 స్టేషన్లు వస్తున్నాయి. ఇప్పుడున్న పెద్ద స్టేషన్లు కాకుండా చిన్నవిగా వీటిని నిర్మించనున్నారు.

# వణికిస్తున్న డెంగీ!

సిరిసిల్ల : ప్రస్తుతం జిల్లాలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఎక్కడ పడితే అక్కడ వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు, ఈగలకు ఆవాసాలుగా మారుతున్నాయి. తద్వారా కాలానుగుణ వ్యాధులు ప్రబలుతున్నాయి. ముఖ్యంగా డెంగీ, మలేరియా, విష జ్వరాలతో జనం ఇబ్బందులు పడుతున్నారు. వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకొంటున్నట్లు అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ఫలితంగా చాలా మంది జ్వరాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. జిల్లాలో జ్వర బాధితులు ఎక్కువగా ఉండటంతో ఇంటింటి సర్వే చేసి తద్వారా వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలను ప్రజలకు వివరించాలని అధికారులు సిబ్బందికి సూచించారు. మరోవైపు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, పీహెచ్‌సీ, జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సమీక్షాసమావేశాలు నిర్వహించి అప్రమత్తం చేశారు. వ్యాధుల కట్టడికి చేపట్టాల్సిన కార్యాచరణపై అవగాహన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. సిబ్బందితో తరచూ సమావేశాలు నిర్వహించి పలు సూచనలు చేస్తూనే ఉన్నారు. కానీ పురపాలక సంఘాలు, పంచాయతీల్లో పారిశుద్ధ్య చర్యలు కొరవడుతున్నాయి. ఫలితంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చాప కింద నీరులా జ్వరాలు ప్రబలుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రులకు జ్వరంతో వచ్చే 100 కేసుల్లో కనీసం నలుగురి నుంచి ఐదుగురికి రక్తకణాలు తగ్గుదల ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. సకాలంలో మేల్కొన్నవారు వైద్యం చేయించుకొని కోలుకుంటున్నారు. లేకుంటే పరిస్థితి విషమిస్తుంది. జిల్లాలో 2023 సంవత్సరంలో 12 డెంగీ కేసులు నమోదు కాగా, ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 16 డెంగీ కేసులు, ఒక మలేరియా కేసు నమోదు కావడం గమనార్హం. అధికారిక లెక్కల్లో రానివి చాలా ఉంటున్నాయి. ఈ లక్షణాలు ఉంటే... తీవ్ర జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, కళ్లు ఎర్రగా మారడం, శరీరంపై దద్దుర్లు వస్తే డెంగీ లక్షణాలుగా భావించాలి. చలి జ్వరం, తలనొప్పి, వాంతులతో పాటు తీవ్ర నీరసం వస్తే మలేరియా లక్షణాలు. సాయంత్రం పూట జ్వరం వస్తుంది.

దోమల బెడద లేకుండా ఇలా చేయాలి

డెంగీ, మలేరియా వ్యాధులకు దోమలే ప్రధాన కారణం. వాటిని నివారించేందుకు ప్రధానంగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. ఇంట్లో కుండీలు, కూలర్లు, నీటి ట్యాంకులను తరచూ శుభ్రం చేస్తుండాలి. వారానికి రెండు రోజులు డ్రై డే పాటించాలి.

ఇళ్ల తలుపులు, కిటికీలకు దోమ తెరలను అమర్చాలి. సాయంత్రం వేళ దోమలు ఇళ్లలోకి రాకుండా తలుపులు, కిటికీలు మూసి వేయాలి. కాళ్లు, చేతులు కప్పి ఉంచే దుస్తులు ధరించడం ఉత్తమం.

జ్వరం, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు ఉంటే వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలి.

యువకుడి మృతి

సిరిసిల్ల అర్బన్, న్యూస్‌టుడే: సిరిసిల్లలోని సిద్ధార్థనగర్‌కు చెందిన జూపల్లి సంపత్‌రావు (35) అనే యువకుడు డెంగీ లక్షణాలతో మృతి చెందాడు. నాలుగు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్న అతను సిరిసిల్లలోని ఓ ఆసుపత్రికి వెళ్లగా రక్త కణాలు తగ్గినట్లు నిర్ధారించారు. వెంటనే కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఏడు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు.

సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం

జిల్లాలో ఈ ఏడాది ఆగస్టు 12 వరకు జిల్లాలో 16 డెంగీ కేసులు నమోదు కాగా మలేరియా ఒక కేసు నమోదైంది. డెంగీ కేసులు నమోదైన ప్రాంతాల్లో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని అప్రమత్తం చేసి అన్ని చర్యలు తీసుకొంటున్నాం. వసంతరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

# ఏటా హరిత లక్ష్యం.. సంరక్షణలో నిర్లక్ష్యం

సారంగాపూర్: సారంగాపూర్ మండలంలోని రేచపల్లి హనుమాన్ గండి వద్ద 2019లో కోతుల ఆహార ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకు రూ.5,52,781 అంచనా తయారు చేసి రూ.2,99,516 వ్యయం చేసి 1258 కూలీలకు పనిదినాలు కల్పించగా, రూ.2,53,265 సామగ్రి కింద వ్యయం చేశారు. అయితే కొన్నేళ్ల పాటు పంచాయతీలు నిర్వహణలో మొక్కలు కనిపించినప్పటికీ తరువాత చేతులెత్తేయడంతో ప్రస్తుతం మొక్కలు కనిపించకుండా పోయి పిచ్చిమొక్కలు, ఏడారిగా మారాయి. కొన్నేళ్లుగా జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా దాదాపు 22,481 ప్రాంతాల్లో దాదాపుగా 2.50 కోట్ల మొక్కలను నాటినట్లు లెక్కలు చూపుతున్నాయి. ఏటా లక్ష్యం నిర్దేశించడంతో స్థలాలు లేకపోవడంతో నాటిన ప్రాంతాల్లోనే మళ్లీ నాటాల్సి వస్తోంది. కొన్ని నర్సరీలలో మొక్కలు అలాగే ఉండిపోవడంతో ఏపుగా పెరిగి వృక్షాలుగా మారుతున్నాయి. ఏటా లక్ష్యాన్ని నిర్దేశించుకుకొని మొక్కలు నాటడంలో చూపుతున్న శ్రద్ధ సంరక్షణలో కనిపించడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మళ్లీ ఈ ఏడాది ఇప్పటికే గ్రామాల్లో గుంతలు తవ్వే ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. జిల్లాలోని 380 పంచాయతీల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా



1732 ప్రాంతాల్లో 36.30 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇందులో 6.05 లక్షల మొక్కలు ఇళ్లలో కాగా మిగతా ప్లాంటేషన్, రహదారుల వెంట, తదితర ప్రాంతాల్లో నాటనున్నారు. ఇప్పటికే వర్షాకాలం ప్రారంభం కావడంతో జిల్లా వ్యాప్తంగా 2,03,778 లక్షల గుంతలు తవ్వి మొక్కలు నాటేందుకు సిద్ధం చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా..

మొక్కల నాటేందుకు నిబంధనలకు అనుగుణంగా కూలీలు గుంతలు తవ్వినప్పుడే మొక్క ఎదుగుదల ఉంటుంది. అయితే ఉపాధి సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టానుసారంగా గుంతలు తవ్వుతున్నారు. కమ్యూనిటీ, ప్లాంటేషన్, హరిత వనాలలో గుంతను 0.45 సెం.మీ. లోతు, వెడల్పు తవ్వాలి. రహదారుల వెంట 2 ఫీట్లు(0.6 సెం.మీ) గుంత తవ్వాలి. ఒక్క గుంత తవ్వినందుకు రూ.23, మొక్క నాటినందుకు రూ.15 కూలీలకు చెల్లిస్తున్నారు. ఇంత మొత్తం వ్యయం చేసినా నిబంధనలకు అనుగుణంగా గుంతలు ఉండడంలేదన్న విమర్శలు ఉన్నాయి. అంతేకాకుండా ఏటా విద్యుత్తు తీగల కింద మొక్కల నాటడంతో ఎదిగిన మొక్కలను తొలగిస్తున్నారు. మళ్లీ అదే ప్రాంతంలో నాటడంతో ప్రజా ధనం వృథా అవుతోంది.

కనిపించని వనాలుగతంలో కోతుల ఆహార ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. పల్లె ప్రకృతి వనాలు, రహదారుల వెంట ఉన్న మొక్కలు కనిపిస్తున్నా.. మిగతా హరిత వనాలు, కోతుల ఆహార ప్రాంగణాలు కనపడకుండా పోతున్నాయి. ఇప్పటికే ఆయా పంచాయతీల్లోని నర్సరీల్లో మొక్కల పెంపకం ప్రక్రియ కొనసాగుతోంది. ప్రతి ఇంటికి అయిదు చొప్పున మొక్కలు లక్ష్యం కోసం అందిస్తున్నారే తప్పా అవసరమైన మొక్కలను అందించకపోవడంతో తీసుకున్న వెంటనే పక్కన పడేస్తున్నారు. కొందరు ఇంటి ఆవరణలో స్థలం లేనప్పటికీ మొక్కలు అందించడంతో వృథా అవుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

# 630 కి.మీ.. రూ.236 కోట్లు

ఖమ్మం : టేకులపల్లి మండలం తడికలపూడి నుంచి ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం చీమలపాడు వరకు ఉన్న రహదారి ఇది. 7 కి.మీ. బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఏడేళ్లుగా కనీస మరమ్మతులకు నోచుకోలేదు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లోని ఆర్అండ్‌బీ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. గతేడాది కురిసిన భారీ వర్షాలతో పలుచోట్ల భారీ గుంతలు ఏర్పడ్డాయి. మరమ్మతులతో శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో ఈ వర్షాకాలంలో ప్రయాణాలు ప్రాణసంకటంగా మారాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి ఆదేశాలతో రోడ్ల దుస్థితిపై ఉభయ జిల్లాల అధికారులు నివేదికలు అందజేశారు. వాటి మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడితేనే ఊరట లభిస్తుంది.

ఆర్అండ్‌బీ రహదారుల నిర్వహణపై ఇటీవల రాష్ట్ర ర.భ. శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రాష్ట్రస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. దెబ్బతిన్న రహదారులపై జిల్లాల వారీగా నివేదికలు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధికారులు వివరాలు సేకరించారు. ఉమ్మడి జిల్లాలో కలిపి మొత్తం 630 కిలో మీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నట్లు నివేదించారు. గుంతల పూడ్చివేత (ప్యాచ్‌వర్క్), ఇతర మరమ్మతులకు మొత్తం రూ.236 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదించారు. వర్షాకాలం నేపథ్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు సత్వరం మరమ్మతులు పూర్తిచేయాల్సి ప్రాధాన్యాన్నీ వారు వివరించారు. మధిర-సిరిపురం రోడ్డు ఇది. టోల్ గేట్ నుంచి రామచంద్రాపురం వరకు చాలాచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. మరికొన్ని చోట్ల వరదతో తారు కొట్టుకుపోయింది. మరమ్మతులకు ఏటా రూ.లక్షలు వెచ్చిస్తున్నా పరిస్థితి మళ్లీ మొదటికొస్తోంది.

సత్వర స్పందనే ముఖ్యం

రాష్ట్ర ర.భ. శాఖకు అన్ని జిల్లాల నుంచి రోడ్ల మరమ్మతులపై నివేదికలు అందాయి. ఆయా ప్రతిపాదనలను పరిశీలించి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వాల్సి ఉంది. అనంతరం నిధులు విడుదల కాగానే జిల్లాస్థాయుల్లో టెండర్ల ప్రక్రియ పూర్తిచేయాలి. ఆ తర్వాత గుత్తేదారులతో సత్వరం మరమ్మతులు ప్రారంభించేలా చూడాలి. అయితే, ఇప్పటికే వర్షాకాలం సీజన్ ప్రారంభమైంది. అడపాదడపా జోరు వానలు సైతం కురుస్తున్నాయి. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈలోపే యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు పూర్తిచేయాల్సి ఉంది. అప్పుడే ప్రజా రవాణాపరమైన కష్టాలు తీరతాయి.

# ముఖం చాటేసిన వర్షాలు.. ముందుకు సాగని పనులు



ఎల్లారెడ్డిపేట : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఊరటనివ్వ లేదు. వరుణదేవుడు ముఖం చాటేయడంతో వ్యవసాయ పనులు ముందుకు సాగడం లేదు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. భూగర్భజల మట్టాలు సైతం లోతుకు పడిపోతుండటం, బోరుబావుల నుంచి నీటి ధార తగ్గిపోతుండటంతో పంటల సాగు సందిగ్ధంలో పడిపోయింది. అప్పుడప్పుడు పడుతున్న చిరుజల్లులు పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, ఇతర అపరాల పంటలకు ప్రాణం పోస్తున్నా ప్రధానంగా వరికి శరాఘాతంగా మారింది. వరి పంట కోసం నార్లు పోసిన రైతులు భారీ వర్షాల కోసం ఆశతో నింగిలోకి తొంగి చూస్తున్నారు. కొన్ని చోట్ల పోసిన నార్లు ముదిరిపోతున్నాయి. జిల్లాలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. చెరువులు, కుంటల్లో నీటి మట్టాలు తగ్గిపోతున్నాయి. సమృద్ధిగా వర్షాలు లేక కర్షకుల్లో ఆశలు తగ్గిపోతున్నాయి.

2.35 లక్షల ఎకరాల్లో పంటల సాగు

జిల్లాలో రైతులు బావులు, బోరుబావులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. ఈ వానాకాలంలో మొత్తం 2,35,866 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో వరి 1,83,080 ఎకరాల్లో, కంది 1,502, మొక్కజొన్న 1,510, పత్తి 49,215, సోయాబీన్ 5, మిరప 180, పెసర 348, మినుము 10, జొన్న 10, ఆముదం 6 ఎకరాల్లో సాగుకానున్నాయని అంచనా వేశారు. వర్షపాతం అంతంత మాత్రమే నమోదు కావడంతో చెరువులు, కుంటల్లోకి కొత్తగా వరద వచ్చి చేరలేదు. దీంతో బావులు, బోరుబావులు రీఛార్జి కాలేదు. బోరుబావుల్లో నుంచి నీటి ధార క్రమంగా తగ్గిపోతుండటంతో వరి సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఈ నెల 26 వరకు జిల్లాలో వరి 20 ఎకరాల్లో, మొక్కజొన్న 438, కంది 58, పెసర 15, పత్తి 31,300 ఎకరాల్లో సాగు చేశారు. జిల్లాలో ఈ నెల 26 వరకు 108.9 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 97.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. 11 మిల్లీమీటర్ల లోటు వర్షపాతం నమోదైంది.

పాతాళంలో గంగ...

ఈ ఏడాది అయినా సమృద్ధిగా వర్షాలు కురిసి పుష్కలంగా పంటలు పండించాలని భావించిన మెట్టప్రాంత రైతులు పాతాళగంగ పైకి రాకపోవడంతో బెంగ పెట్టుకున్నారు. బోరుబావులు వట్టిపోయే దశకు చేరుతున్నాయి. వర్షాకాలం సీజన్ నుంచి నేటి వరకు కురిసిన జల్లులు ఏ మాత్రం ప్రభావం చూపలేదు. సాగునీరు మృగ్యమై పంటలు వేసే ప్రక్రియ ఊగిసలాట నడుమ కొనసాగుతోంది. భూగర్భ జల మట్టాలు వందల మీటర్ల లోతులోకి దిగజారిపోవడం వల్ల నిరంతరంగా కరెంటున్నా నీరు రావడం లేదని వాపోతున్నారు. పంటలు సాగు చేయాలా? వద్దా అనే ఆలోచనలో పడిపోయినట్లు రైతులు చెబుతున్నారు. 2023 నవంబరుకు, ఈ సంవత్సరం మే మాసంతో పోల్చితే 5.7 మీటర్ల లోతుకు భూగర్భజల మట్టాలు పడిపోయాయి. అలాగే గతేడాది మే నెలకు, ఈ ఏడాది మే నెలకు పోల్చితే 2.28 మీటర్ల లోతుకు వెళ్లాయి. ఈ సంవత్సరం ఏప్రిల్ నుంచి మే వరకు 1.07 మీటర్ల స్వల్ప వృద్ధి కనిపిస్తున్నా నీటి తోడకం ఎక్కువవుతుండటంతో భూగర్భజల మట్టాలు మళ్లీ దిగజారిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. బోయినపల్లి మండలంలో తక్కువ లోతులో సగటున 6.12 మీటర్లలో ఉండగా, వేములవాడ అర్బన్‌లో అత్యధిక లోతులో 17.42 మీటర్లలో భూగర్భజలాలు లభిస్తున్నాయి.

జులై 15 వరకు వరి, పత్తి సాగుకు అవకాశం

సాధారణంగా జూన్ 21 తర్వాత పంటల సాగు ఊపందుకుంటుంది. జులై 15 వరకు పత్తి, మొక్కజొన్న, కంది, మినుము పంటలు సాగు చేసే అవకాశముంది. 50 నుంచి 60 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైన తర్వాత పత్తి విత్తనాలు విత్తితే మొలకశాతం ఎక్కువగా ఉంటుంది. జులై 15 వరకు నార్లు పోసుకోవచ్చు. అలాగే ఆగస్టు మొదటి వారం వరకు వరినాట్లు వేసుకోవచ్చు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వరి నారు యాజమాన్యంలో మొగిపురుగును తట్టుకోవడానికి నార్లు తీసే వారం రోజుల ముందు ఎకరానికి సరిపడే నారుకు కిలో కార్బోఫ్యూరాన్ గుళికలు గానీ, కార్టాఫ్‌హైడ్రోక్లోరైడ్ గుళికలను చల్లుకోవాలి.

భూమిరెడ్డి, మండల వ్యవయాధికారి, ఎల్లారెడ్డిపేట

# పర్యావరణ పరిరక్షణ.. అత్యున్నత శిక్షణ



ములుగు: ఉన్నత విద్యా ప్రమాణాలకు తోడు రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో అన్ని స్థాయిల్లో అటవీ శాఖ అధికారులను అందించాలన్న సంకల్పంతో వెలిసింది సిద్దిపేట జిల్లా ములుగులోని అటవీ కళాశాల పరిశోధన కేంద్రం. ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి కళాశాలలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా అటవీ నిర్వహణను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అటవీ విద్యను అందుబాటులోకి తీసుకొచ్చింది. 2016లో అటవీ విద్యకు సంబంధించి బీఎస్సీ కోర్సును ప్రారంభించారు. మొదట్లో హైదరాబాద్ కొంపల్లి సమీపంలోని దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో కళాశాల ఏర్పాటు చేశారు. 2018లో సిద్దిపేట జిల్లా ములుగులో సొంత భవనాలను నిర్మించి నాటి సీఎం చేతుల మీదుగా కళాశాలను ప్రారంభించారు. ప్రస్తుతం కళాశాలలో బీఎస్సీ, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ కోర్సులు నిర్వహిస్తున్నారు.

అందుబాటులో వసతిగృహాలు

అటవీ కళాశాల పరిశోధన కేంద్రానికి సంబంధించిన భవనాలను రూ.72 కోట్లతో నిర్మించారు. అధునాతన సౌకర్యాలతో కూడిన తరగతి గదులు, పరిశోధనా కేంద్రాలు, విద్యార్థులకు వేర్వేరుగా వసతిగృహాలను ఏర్పాటు చేశారు. అధ్యాపకులు, సిబ్బందికి ప్రత్యేకంగా వసతిగృహాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. కళాశాల పరిశోధనా కేంద్రానికి 52 హెక్టార్ల అటవీ భూములను కేటాయించారు. ఆట మైదానం అందుబాటులో ఉంది. మొక్కలు పెంచి పరిశోధన చేసే అవకాశం కల్పించారు.

వివిధ అంశాలపై తర్ఫీదు

అటవీ కళాశాల విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రత్యేకంగా తేనెటీగల పెంపకం, సేంద్రియ ఎరువుల తయారీ, నర్సరీల ఏర్పాటు, వుడ్ వర్క్‌షాపోపై ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. బోధనలో భాగంగా విద్యార్థులను దేశంలోని పలు ప్రాంతాలకు క్షేత్ర స్థాయి పర్యటనలకు తీసుకెళ్తున్నారు. కేంద్రంలోని నర్సరీలో మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నారు. మరోవైపు ఆటల్లోనూ రాణించేలా శిక్షణ ఇస్తున్నారు. వ్యాయామం, యోగా వంటివి నిత్యం తప్పనిసరి. పోటీ పరీక్షలు రాసేందుకు ప్రత్యేకంగా కోచింగ్ సెంటరునూ ఏర్పాటు చేశారు. ఇటీవల జరిగిన స్నాతకోత్సవంలో చదువుతో పాటు వివిధ విభాగాల్లో రాణించిన పలువురు విద్యార్థులు గవర్నర్ రాధాకృష్ణన్ నుంచి బంగారు పతకాలు అందుకున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

దేశంలో ఎక్కడా లేని విధంగా అధునాతన సౌకర్యాలతో కూడిన కళాశాల పరిశోధనా కేంద్రాన్ని ప్రభుత్వం ములుగులో ఏర్పాటు చేసింది. ఇక్కడ చదివిన విద్యార్థులకు ఉజ్వల భవిత ఖాయం. ఇక్కడి అవకాశాలను ఆసక్తి ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలి.

ఆశ, కళాశాల పరిశోధన కేంద్రం డీన్

కోర్సుల వివరాలు..

బీఎస్సీలో ఏటా 65 మందికి ప్రవేశం కల్పిస్తున్నారు. ఎమ్మెస్సీలో 20 మంది చేరేందుకు అవకాశం ఉంది. పీహెచ్‌డీలో అయిదు నుంచి పది మందికి మాత్రమే అవకాశం కల్పిస్తారు. ఇప్పటివరకు కళాశాల నుంచి అటవీ శాస్త్రంలో బీఎస్సీ పూర్తి చేసిన 250 మంది విద్యార్థులు బయటకు వెళ్లారు. వీరిలో కొందరు ఉద్యోగాలు సాధించగా, మరికొందరు ఉన్నత విద్య అభ్యసిస్తున్నారు. ఎమ్మెస్సీ పూర్తి చేసిన 40 మంది ఇక్కడి నుంచి బయటకు వెళ్లారు. పీహెచ్‌డీ విద్యార్థుల పరిశోధనలు కొనసాగుతున్నాయి.

దరఖాస్తు ఇలా..ప్రస్తుతం కళాశాల పరిశోధన కేంద్రంలో బీఎస్సీ అటవీ శాస్త్రానికి సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ర్యాంకుల ఆధారంగా 50 మంది విద్యార్థులను చేర్చుకుంటారు. పేమెంట్ ఆధారంగా 10 మంది, ఈడబ్ల్యూఎస్ ద్వారా మరో ఐదుగురికి ప్రవేశం కల్పిస్తారు. ఈ నెల 27 వరకు దరఖాస్తు చేయడానికి గడువుంది.

# కంటోన్మెంట్ విలీనంపై ముందడుగు

హైదరాబాద్ : సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని సివీలియన్ ప్రాంతాలను జీహెచ్ఎంసీలో విలీనం చేసే విషయమై కేంద్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. విలీన అంశానికి సంబంధించిన విధివిధానాలపై కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి గిరిధర్ ఈనెల 25న తెలంగాణ చీఫ్ కార్యదర్శి శాంతికుమారితో వీడియో కాన్ఫరెన్స్‌లో చర్చించారు. బ్రిటిష్ పాలన నుంచి నేటివరకు దేశంలో కొనసాగుతున్న కంటోన్మెంట్ బోర్డులను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నందున, విలీన ప్రక్రియను త్వరతగతిన పూర్తి చేయాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే విలీనానికి సిద్ధంగా ఉన్నట్లు సమ్మతిని తెలిపిందని, విలీన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు పట్టుదలతో ఉందని శాంతికుమారి పేర్కొన్నట్లు సచివాలయ అధికారులు జారీ చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ తమ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించలేదని, ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో కలిసి పనిచేస్తుందని శాంతికుమారి వెల్లడించినట్లు అధికారులు వివరించారు.

# మురుగు శుద్ధి కేంద్రంపై పట్టిపం?

కరీంనగర్ : స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలో మార్కులు సాధించడం.. సఫాయిమిత్ర సురక్ష ఛాలెంజ్‌లో నగదు పురస్కారం దక్కించుకున్నా.. మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్వహణలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన దీనిని పకడ్బందీగా అమలు చేయాల్సి ఉండగా ఎవరికి వారు దాటేసే ధోరణి ప్రదర్శిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఎక్కడా లేనివిధంగా మొట్టమొదటిగా కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో భూగర్భ మురుగునీటి శుద్ధి కేంద్రం (యూజీడీ)ని రూ.76.50 కోట్లతో నిర్మించారు. ఏళ్ల తరబడి పనులు కొనసాగినా.. చివరికి పదేళ్ల కిందట వినియోగంలోకి తీసుకొచ్చారు. నగర వీధుల గుండా పైపులైన్లు ఉండగా సమీప ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చారు. వీటి గుండా వచ్చే మురుగునీరంతా శుద్ధి చేసేందుకు శివారులోని గోపాల్ చెరువులో 38 ఎంఎల్‌డీల సీవరేజ్ ట్రీట్‌మెంట్



ప్లాంటు నిర్మించారు. సుమారు 2-3 ఎంఎల్‌డీల నీటిని ప్రతిరోజు శుద్ధి చేస్తున్నారు.

ర్యాంకుల కోసం ముస్తాబు

మురుగునీటి శుద్ధి కేంద్రం ఉండగా దానిని నగర వీధుల గుండా వచ్చే మురుగునీటిని శుద్ధి చేయాలనే ఆలోచన వదిలేసి కేవలం ర్యాంకుల కోసం మాత్రమే ముస్తాబు చేస్తున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్, వాటర్ం, ఇతర పోటీల సమయంలో అధికారులు, ఉద్యోగులు వచ్చి హడావుడి చేస్తున్నారు. గతేడాది వాటర్ం సర్వే సమయంలో లోపాలు కొట్టొచ్చినట్లుగా కనిపించగా అప్పటికప్పుడే కప్పిపుచ్చుకునే ప్రయత్నాలు చేశారు. ఆ సర్వే పూర్తి కాగానే ఆ వైపు చూడటం లేదు.

సామర్థ్యం ఉన్నా..

ఇంటి నుంచే మురుగునీటిని పైపులైను గుండా యూజీడీ ప్లాంట్‌కు తరలించి శుద్ధి చేయాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు. ఎస్టీపీలో మరో 36 ఎంఎల్‌డీల సామర్థ్యం ఉండగా 40 వేల ఇళ్లకు కనెక్షన్ ఇచ్చుకునే వీలుంది. ప్రస్తుతం మారుతీనగర్, హుస్సేనీపురలోని సుమారు 5 వేల ఇళ్లకు కనెక్షన్లు ఇవ్వడంతో ఆ నీరే ప్లాంట్‌కు చేరుతోంది. ఈ నీరు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో వరదకాలువలోని నీటిని తీసుకొని శుద్ధి చేస్తున్నారు. ఇంటింటా కనెక్షన్ ఇవ్వాలంటే పలు చోట్ల పైపులైన్ల అనుసంధాన పనులు చేయాల్సి ఉంది. ఈ పనులతో పాటు కొత్త కనెక్షన్ల ఊసే లేకుండా పోతుంది.

కొత్త రోడ్లపై కనిపించని భూగర్భ డ్రైనేజీ

స్మార్ట్‌సిటీలో భాగంగా నగరవ్యాప్తంగా కొత్తగా రోడ్లు వేశారు. ఆ సమయంలో భూగర్భ డ్రైనేజీ లైన్ల పైపులైన్లు వేయడంతో పాటు ఇంటర్ కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. పైగా ఛాంబర్ నుంచి ఛాంబర్ వరకు తనిఖీ చేయాలి. అదేదీ లేకుండా ఇష్టానుసారంగా పనులు చేసి చేతులు దులుపుకొన్నారు. పైగా గతంలో వేసిన పైపులైన్లు పలుచోట్ల ధ్వంసం చేశారు. ఒక్కోచోట ఒక్కోరకంగా ఉండటంతో అందులోంచి మురుగునీరు ప్రవహించే పరిస్థితి లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కొరవడిన చిత్తశుద్ధి

యూజీడీ ప్లాంటులో మొత్తం అయిదు మోటార్లు ఉన్నాయి. ఇందులో 150 హెచ్‌పీ మోటార్లు మూడు ఉండగా ఒకే ఒక మోటారు నడుస్తోంది. 75 హెచ్‌పీ రెండు మోటార్లు ఉండగా అవి పని చేయడం లేదు. నాలుగేళ్లుగా తాత్కాలిక మరమ్మతులతో నెట్టుకురాగా.. ప్రస్తుతం అవి ఏమాత్రం పని చేయడం లేదు. ఏకైక మోటారుతో రోజుకు రెండు, మూడు ఎంఎల్‌డీల నీటిని మాత్రమే శుద్ధి చేసి సమీపంలోని చెరువులకు వదిలి పెడుతున్నారు. దీంతో పాటు ప్యానల్ బోర్డులు, ఇతర సమస్యలుండగా మరమ్మతులు చేయడం లేదు. ఆరోగ్య సమస్యలు రాకుండా పని చేసే కార్మికులకు కావాల్సిన కిట్లు కూడా సరఫరా చేయడం లేదు.

నిర్వహణకు ప్రతిపాదనలు పిలిచాం

ఓంప్రకాశ్, డీఈఈ, కరీంనగర్ నగరపాలిక

గతంలో పని చేసిన ఏజెన్సీ నుంచే మరమ్మతులు, నిర్వహణ పనులు చేసేందుకు ప్రతిపాదనలు ఇవ్వాలని కోరాం. లైన్లు వేయడంతో పాటు మోటార్లు బాగు చేయడం కూడా అందులోనే ఉంటుంది. ఒకట్రెండు రోజుల్లో ఎస్టిమేట్స్ తీసుకొని ప్రక్రియ ప్రారంభిస్తాం.


# కార్డుల్లేక.. పదేళ్లుగా ప'రేషన్'

ఖమ్మం : జననాల సంఖ్య పెరుగుతున్నా, కుటుంబాల విభజన జరుగుతున్నా.. జిల్లాలో రేషన్ కార్డుల సంఖ్య ఏటా తగ్గిపోతోంది. పుట్టినవారి పేర్లు రేషన్ కార్డుల్లో నమోదు చేయకపోగా.. మరణించిన వారి పేర్లు ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. కొత్తకార్డుల కోసం పేద కుటుంబాలు కళ్లల్లో వత్తులేసుకుని ఎదురు చూస్తున్నాయి. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నుంచి కొత్తగా తెల్లరేషన్ కార్డులు ఇవ్వలేదు. అంతకు ముందు జారీ చేసిన కార్డుల ఆధారంగానే ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేశారు. డిజిటల్ విధానంలో లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఎవరికైనా కార్డు వివరాలు కావాలంటే వారికి కేటాయించిన సంఖ్య ఆధారంగా మీ సేవ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందే. 2021లో జిల్లాలో 12,216 మందికి కొత్తగా తెల్ల రేషన్ కార్డులను అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ తర్వాత మళ్లీఊసేలేదు.చనిపోతే వెంటనే వివరాల తొలగింపు.. రేషన్ కార్డుల వివరాలన్నీ ఆధార్‌తో అనుసంధానం చేశారు. దీంతో ఎవరైనా చనిపోతే పౌరసరఫరాలశాఖ ఉపయోగిస్తున్న '360 డిగ్రీస్ సాఫ్ట్‌వేర్'తో వారి వివరాలు వెంటనే తొలగిస్తున్నారు. కానీ కొత్తగా పుట్టిన పిల్లల పేర్లు మాత్రం నమోదు చేయడం లేదు. ఇక కుటుంబాలు విభజన అవుతున్నాయి. విభాజిత కుటుంబాల వారు కార్డులు జారీచేయాలని పదేళ్లుగా కోరుతున్నారు. తాము పథకాలకు నోచుకోవడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంపైనే వీరంతా ఆశలు పెట్టుకున్నారు. 'ప్రజాపాలన' గ్రామసభల్లో అత్యధికంగా కార్డుల కోసమే దరఖాస్తులిచ్చారు. ఆ వివరాలు ఇంకా పౌరసరఫరాల శాఖకు చేరలేదు. రేషన్ కార్డు దరఖాస్తులకు గతంలో ఉపయోగించిన వెబ్‌సైట్ కూడా ఇప్పుడు పనిచేయడం లేదు.

కొత్త కార్డుల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. కార్డులు కావాలని దరఖాస్తు చేసుకున్నవారు, పిల్లల పేర్లు నమోదు చేయాలని కోరుతున్న వారి వివరాలు మా వద్ద లేవు.

చందన్‌కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి

# ఏపీలో మల్టీ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్: సీఎం చంద్రబాబు



అమరావతి: కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ.. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఐఐ ద్వారా అమరావతిలో గ్లోబల్ లీడర్ షిప్ సెంటర్ ఏర్పాటుపై చర్చించారు. ఆర్థికాభివృద్ధిపై టాస్క్‌ఫోర్స్ సిఫార్సులకనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సీఐఐ ఇండస్ట్రీ ఫోరమ్ ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్టు సమావేశం అనంతరం సీఎం చంద్రబాబు ఎక్స్‌లో పోస్టు చేశారు. సీఐఐ మల్టీ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, సీఐఐ మోడల్ కెరీర్ సెంటర్ వంటి కార్యక్రమాల ద్వారా ఏపీ యువతలో నైపుణ్యాలు, ఉపాధిని పెంపొందించడంపై దృష్టి పెడతామని సీఎం తెలిపారు.




## ఎస్ఎస్ఎల్వీ-డీ3 విజయవంతం..

శ్రీహరికోట: ఇస్రో చేపట్టిన ఎస్ఎస్ఎల్వీ–డీ3 ప్రయోగం విజయవంతమైంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్ నుంచి ఈ వాహక నౌక నింగిలోకి దూసుకెళ్లింది.

ఈ ప్రయోగం ద్వారా 175 కిలోల ఈవోఎస్–08 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. మొత్తం 17 నిమిషాల పాటు ఈ ప్రయోగం సాగింది. విపత్తు నిర్వహణలో సమాచారం ఇచ్చేందుకు ఈ ఉపగ్రహం ఉపయోగపడనుంది. పర్యావరణం, ప్రకృతి విపత్తులు, అగ్ని పర్వతాలపై ఇది పర్యవేక్షించనుంది. ఇస్రోకు చెందిన యూఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో ఈవోఎస్‌ను అభివృద్ధి చేశారు. ఇందులో ఉండే ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్ (ఈవోఐఆర్) పేలోడ్ మిడ్–వేవ్, లాంగ్ వేవ్ ఇన్‌ఫ్రా–రెడ్‌లో చిత్రాలను క్యాప్చర్ చేస్తుంది. విపత్తు నిర్వహణలో ఈ సమాచారం ఉపయోగపడుతుందని ఇస్రో పేర్కొంది. ప్రయోగం విజయవంతం కావడంతో శాస్త్రవేత్తలను ఇస్రో ఛైర్మన్ అభినందించారు. ఎస్ఎస్ఎల్వీ–డీ3 ప్రయోగం విజయంవతం పట్ల ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. భారత అంతరిక్ష నైపుణ్య కీర్తి మరోసారి సత్తా చాటిందని పేర్కొన్నారు. ఇస్రో బృందం భవిష్యత్ ప్రయత్నాలకు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబు భేటీ ఖరారు.. ఎప్పుడంటే?




న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరోసారి భేటీ కానున్నారు. ఈ మేరకు ప్రధాని అపాయింట్‌మెంట్ ఖరారైంది. రేపు (శనివారం) సాయంత్రం 4 గంటలకు ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీ కానున్నారు. షెడ్యూల్ ప్రకారం ఇవాళ చంద్రబాబు ఢిల్లీకి వెళ్లనున్నారు. పోలవరం నిధులపై చంద్రబాబు చర్చించనున్నారు. రేపు (శనివారం) సాయంత్రం 6 గంటలకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ కానున్నారు. గంట తర్వాత అంటే రాత్రి 7 గంటలకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. ప్రధాని మోడీ, అమిత్ షాలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై చంద్రబాబు చర్చించనున్నారు. అదే విధంగా అమరావతి పునర్నిర్మాణం, పోలవరం, వెనుకబడిన జిల్లాలకు నిధులతో పాటు కొత్త రుణాలపై కూడా ప్రధాని మోదీతో చంద్రబాబు చర్చించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. కాగా ఇటీవల కేంద్ర బడ్జెట్ 2024–25లో అమరావతికి ప్రత్యేక సాయంగా కేంద్రం రూ.15 వేల కోట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్ హయాంలో చేసిన రుణాలను రీషెడ్యూల్ చేయాలని కూడా ప్రధాని మోదీని చంద్రబాబు కోరనున్నారని తెలుస్తోంది. ఇదిలావుండగా.. ఇటీవలే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఏపీ ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కలిశారు. ఏపీ ఆర్థిక అంశాలపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో జరుగుతున్న చంద్రబాబు పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది.

# సీఎం చంద్రబాబుతో టాటా ఛైర్మన్ చంద్రశేఖరన్ భేటీ.. ఎందుకంటే?




అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్ శుక్రవారం భేటీ అయ్యారు. సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలో పెట్టుబడుల అంశంపై ఇరువరు చర్చించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, స్వర్ణాంధ్రప్రదేశ్– విజన్ 2047 రూపకల్పన అంశాలపై మాట్లాడారు. పారిశ్రామిక అభివృద్ధికి సూచనలు, సలహాలు ఇచ్చేందుకు, ప్రణాళికలు అందించేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. దేశంలో పేరున్న పారిశ్రామికవేత్తలు, ఆయా రంగాల నిపుణులతో ఈ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు కానుంది. ఈ టాస్క్ ఫోర్స్ ఛైర్మన్‌గా ముఖ్యమంత్రి ఉంటారు. ఇక టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్ కో ఛైర్మన్‌గా ఉండనున్నారు. 2047 నాటికి ఏపీని నెంబర్ 1 రాష్ట్రంగా నిలిపే లక్ష్యంతో విజన్ 2047 రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తోంది.

దీనిలో భాగంగా పారిశ్రామికాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై టాస్క్ ఫోర్స్ పనిచేయనుంది. అమరావతిలో సీఐఐ భాగస్వామ్యంతో స్టేట్ ఆఫ్ సెంటర్ ఫర్ గ్లోబల్ లీడర్ షిప్ సంస్థ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సంస్థ ఏర్పాటులో టాటా గ్రూప్ భాగస్వామి కానుంది. ఇక విశాఖలో టీసీఎస్ డెవల్మెంట్ సెంటర్ ఏర్పాటు, ఏపీలో ఎయిర్ ఇండియా, విస్తారా ఎయిర్ లైన్స్ విస్తరణ అంశాలపై టాటా గ్రూప్ ఛైర్మన్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చించారు. రాష్ట్రంలో సోలార్, టెలికమ్యునికేషన్స్, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుపై సీఎం చర్చించారు.

# 100 రోజుల్లోనే అన్నా క్యాంటీన్లు ప్రారంభించాం..

గుంటూరు, ఆగస్టు 16: రాష్ట్రంలో అన్న క్యాంటీన్‌లు నిన్న(గురువారం) పున:ప్రారంభమయ్యాయి. ఈ సందర్భం మంత్రి నారా లోకేష్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజులలోనే అన్న క్యాంటీన్లు ప్రారంభించామని తెలిపారు. 2019 సెప్టెంబర్ వైసీపీ కూడా అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తాం అని చెప్పారన్నారు. అయితే సర్వే ర్యాలీలో జగన్ రెడ్డి ఫోటో వెయ్యడానికి వేల కోట్లు ఖర్చు చేశారని.. అలాంటిది అన్న క్యాంటీన్లకు నిధులు లేవు అని చెప్పారని మండిపడ్డారు. రూ. 200 కోట్లతో అన్న క్యాంటీన్లను నడపించవచ్చారు. సర్వే రాళ్ళ కోసం ఖర్చు చేసిన డబ్బుతో 3 ఏళ్లు అన్న క్యాంటీన్లు నడిపించచ్చన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు పేదవారిని అవమానించారన్నారు. పేద ప్రజల కోసం ఎవరు పని చేస్తున్నారు అనేది ప్రజలు పరిశీలించాలని తెలిపారు. మంగళగిరి నియోజవర్గం చేనేత వర్గాలకు జీఎస్టీ తొలగింపుకు కసరత్తు చేస్తున్నామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. కాగా.. స్వాతంత్ర్యదినోత్సవం రోజు గుడివాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. సతీమణి భువనేశ్వరితో కలిసి స్వయంగా పేదవారికి అన్నం వడ్డించారు. అనంతరం సీఎం దంపతులు కూడా అక్కడే భోజనం చేశారు. నిన్న ఈ పథకానికి సీఎం శ్రీకారం చుట్టగా నేడు రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవాలు జరుగుతున్నాయి. నెల్లూరు, గుంటూరు, తెనాలి, ఏలూరులో జిల్లాలో అన్న క్యాంటీన్లు పండుగలా ప్రారంభమయ్యాయి. మరోవైపు అన్న క్యాంటీన్‌లకు విరాళాలందించే విషయంలో ప్రజల నుంచి భారీగా స్పందన వస్తోంది. పేదలకు ఐదు రూపాయలకే భోజనం అందించే నిమిత్తం పారిశ్రామికవేత్తలు, సాధారణ ప్రజలు, వృద్ధులు సైతం తరలి



వచ్చి విరాళాలిస్తున్నారు. బుధవారం ఒక్క రోజే రూ.2 కోట్లకుపైగా విరాళాలు అందాయి. వివిధ వర్గాల ప్రజలు, సంస్థలు విరాళాలిచ్చేందుకు ఆసక్తి చూపుతుండటంతో అన్న క్యాంటీన్ల నిర్వహణ చూస్తున్న మున్సిపల్‌శాఖ విరాళాలు తీసుకునేందుకు బ్యాంక్ ఖాతా వివరాలను ప్రకటించింది. విరాళాలు పంపించాలనుకునేవారు ఆ ఖాతాకు నేరుగా ఆన్‌లైన్ విధానంలో లేదా చెక్ రాసి పంపవచ్చని తెలిపింది. అన్న క్యాంటీన్స్, అకౌంట్ నెంబరు 37818165097కు గుంటూరు చంద్రమౌళినగర్ ఎస్‌బీఐ బ్రాంచ్‌కు చెందేలా జమచేయవచ్చని పేర్కొంది. ఎస్‌బీఐ ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ 0020541 నంబరుకు నగదు పంపవచ్చని తెలిపింది. గురువారం గుడివాడలో జరిగిన అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ఖాతా వివరాలు ప్రకటించారు. ప్రజల భాగస్వామ్యంతో ఒక స్ఫూర్తినింపేలా అన్న క్యాంటీన్ల నిర్వహణ ఉంటుందని సీఎం చెప్పారు.




# ఎవరి ఆదేశంతో దాడికి పాల్పడ్డారు?.. జోగి రమేశ్‌కు పోలీసుల ప్రశ్నల వర్షం

అమరావతి: చంద్రబాబు నివాసంపై దాడి కేసులో వైకాపా నేత, మాజీ మంత్రి జోగి రమేశ్‌ను మంగళగిరి పోలీసులు సుదీర్ఘంగా విచారించారు. సుమారు గంటా నలభై నిమిషాల పాటు జోగి రమేశ్‌ను ప్రశ్నించారు. ఆ రోజు దాడికి సంబంధించిన వివరాలను పోలీసులు అడిగి తెలుసుకున్నారు. ఎన్ని వాహనాల్లో వచ్చారు? ఎంత మంది దాడిలో పాల్గొన్నారు? ఎవరి ఆదేశంతో దాడికి పాల్పడ్డారు? దాడికి ముందస్తు ప్రణాళిక రచించారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేశారు. జోగి రమేశ్‌తో పాటు ఆయన డ్రైవర్ తాంద్ర రాముని పోలీసులు ప్రశ్నించారు. ఈ కేసును న్యాయస్థానంలో ఎదుర్కొంటామని విచారణ అనంతరం జోగి రమేశ్ చెప్పారు.

తనపై కక్షతో ప్రభుత్వం ఈ కేసు పెట్టిందని ఆరోపించారు. పోలీసులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం ఇచ్చానన్నారు. అయ్యన్నపాత్రుడు జగన్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలకు మనస్తాపం చెంది.. చంద్రబాబుకి తన నిరసన తెలపాలనే ఉద్దేశంతోనే అక్కడికి వెళ్లానని చెప్పారు. అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంలో నోటిఫికేషన్ ఇచ్చిన భూమి మాత్రమే తన కుమారుడు కొనుగోలు చేశారన్నారు. ఈ విషయంలో అన్ని వివరాలు మీడియా ముందు ఉంచుతానన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టి సారించాలని సూచించారు.




హైదరాబాద్: వైకాపా నేత దేవినేని అవినాష్‌కు శంషాబాద్ విమానాశ్రయంలో చుక్కెదురైంది.

గురువారం రాత్రి హైదరాబాద్ నుంచి దుబాయ్ వెళ్లేందుకు యత్నిస్తుండగా.. విమానాశ్రయ అధికారులు ఆయన్ను అడ్డుకున్నారు. అనంతరం ఏపీలోని మంగళగిరి పోలీసులకు వారు సమాచారం అందించారు. ఆయనపై కేసులు ఉన్నందున ప్రయాణానికి అనుమతి ఇవ్వొద్దని పోలీసులు వారిని కోరారు. ఈక్రమంలో దేవినేని అవినాష్ ప్రయాణాన్ని అధికారులు అడ్డుకోవడంతో.. ఎయిర్‌పోర్టు నుంచి వెనుదిరిగి వెళ్లిపోయారు. తెదేపా కార్యాలయంపై దాడి కేసులో దేవినేని అవినాష్‌పై ఎఫ్ఐఆర్ నమోదైన విషయం తెలిసిందే.

ఈ దాడిలో పాల్గొన్న వారిపై పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టి.. లుకౌట్ నోటీసులు జారీ చేశారు.

# ఎస్ఎస్ఎల్వి-డీ3 విజయవంతం కావడం సంతోషదాయకం

అమరావతి, ఆగస్టు 16: ఇస్రో చేపట్టిన ఎస్ఎస్ఎల్వి–డీ3 విజయం దేశానికి గర్వకారణం అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. రాకెట్ ప్రయోగం విజయవంతం కావడం సంతోషదాయకమంటూ శుక్రవారం నాడు డిప్యూటీ సీఎం ప్రెస్‌నోట్ విడుదల చేశారు. ఈ వాహక నౌక నింగిలోకి దూసుకుపోయి ఈవోఎస్–8 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టిందన్నారు. మన అంతరిక్షరంగ నిపుణులు దేశంకోసం ఎంతగానో తపించి ఉపగ్రహాలను రూపొందించి కక్ష్యలోకి ప్రవేశపెడుతున్నారన్నారు. పర్యావరణం, ప్రకృతి విపత్తులు, అగ్ని పర్వాతలపై ఈ ఉపగ్రహం పర్యవేక్షించడం సమాజానికి ఎంతో ప్రయోగజనకరమన్నారు. ఈ ప్రయోగాన్ని విజయవంతం చేసిన శాస్త్రవేత్తలకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నాను. అంతరిక్షం రంగంలో దేశానికి గర్వకారణమయ్యే విషయాలతో మన కీర్తిని ఎప్పటికప్పుడు ఇనుమడింపచేస్తున్నారని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. కాగా..ఎస్ఎస్ఎల్వీ డీ–3 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. శ్రీహరికోటలోని షార్ రాకెట్ ప్రయోగ కేంద్రం నుంచి సరిగ్గా ఈ ఉదయం 9.17 గంటలకు ఈవోఎస్–08 భూ పరిశీలన శాటిలైట్‌ని మోసుకొని రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఎస్ఎస్ఎల్వీ–డీ3–ఈవోఎస్8 మిషన్‌లో ఇది మూడవది, చివరి ప్రయోగం. దీంతో శాస్త్రవేత్తల్లో ఆనందం వెల్లివిరిసింది. ఎస్ఎస్ఎల్వీ–డీ3 రాకెట్ బరువు 119 టన్నులు, ఎత్తు 34 మీటర్లు, వెడల్పు 2 మీటర్లుగా ఉన్నాయి. భూ ఉపరితలం నుంచి 475 కి.మీ ఎత్తున శాటిలైట్‌ని కక్ష్యలోకి ప్రవేశపెట్టేలా డిజైన్ చేశారు. ఈవోఎస్–08 శాటిలైట్ బరువు 175.5 కిలోలు. శాటిలైట్‌లో మూడు పే లోడ్స్‌ని ఇస్రో శాస్త్రవేత్తలు అమర్చారు. భూ పరిశీలన, విపత్తు పర్యవేక్షణ,



పర్యావరణ పరిరక్షణ, రక్షణ రంగానికి సంబంధించిన సేవల కోసం ఈ శాటిలైట్‌ను రూపొందించారు. ఏడాది కాలం సేవలు అందించేలా దీనిని రూపకల్పన చేశారు. ఎస్ఎస్ఎల్వీ–డీ 3 ప్రయోగం విజయవంతమవడంపై ఇస్రో చీఫ్ సోమనాథ్ స్పందించారు. సంతాసవ్యంగా జరిగిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఎస్ఎస్ఎల్వీ–డీ3/ఈవోఎస్–08 చిన్న–లిఫ్ట్ లాంచ్ వెహికల్ అని, ఈ మిషన్‌లో మూడవ ప్రయోగమైన ఇది విజయవంతంగా పూర్తయిందని సోమనాథ్ వెల్లడించారు. అంచనాల్లో ఎలాంటి మార్పులు లేకుండా ప్రణాళిక ప్రకారం ఉపగ్రహాన్ని ఖచ్చితమైన కక్ష్యలో ప్రవేశపెట్టిందని ఆయన వివరించారు. "పూర్తిస్థాయిలో ట్రాకింగ్ చేసిన తర్వాత తుది కక్ష్య తెలుస్తుంది. అయితే ప్రస్తుత సంకేతాల ప్రకారం ప్రతిదీ ఖచ్చితంగా జరుగుతోంది. ఈవోఎస్–08 ఉపగ్రహంతో పాటు ఎస్ఆర్–08 ఉపగ్రహం కూడా కక్ష్యలోకి చేరుకుంది. ఎస్ఎస్ఎల్వీ–డీ3 బృందానికి, ప్రాజెక్ట్ బృందానికి నా అభినందనలు" సోమనాథ్ తెలిపారు.

# జిల్లా కేంద్రంగా హిందూపురాన్ని చేయాలి: బాలకృష్ణ

హిందూపురం: సత్య సాయి జిల్లా హిందూపురంలో ఎమ్మెల్యే బాలకృష్ణ అన్న క్యాంటీన్లను రెండు చోట్ల ప్రారంభించారు. స్వయంగా పేదలకు భోజనాన్ని వడ్డించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని బసవతారకం ఆసుపత్రిలో జెండా వందనం చేసి తల్లిని స్మరించుకున్నాను. ఈ రోజు ఎన్టీఆర్ పేరుతో ఏర్పాటైన అన్న క్యాంటీన్లను ప్రారంభించి అన్న పేరు స్మరించుకున్నాను. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ తిరిగి అధికారంలోకి రావడం.. అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉంది. పేదలకు మూడు పూటలా కడుపునిండా భోజనం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే వంద అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశాం. భవిష్యత్తులో మరిన్ని అందుబాటులోకి తీసుకొస్తాం. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్నారు" "హిందూపురం అభివృద్ధికి సీఎం చంద్రబాబు రూ.90 కోట్లు మంజూరు చేస్తారు. భవిష్యత్తులో కూడా మరిన్ని నిధులు వస్తాయి.



హిందూపురం అంటే చంద్రబాబుకు ఎనలేని అభిమానం. అందుకే పారిశ్రామిక క్లస్టర్లు ఏర్పాటు చేశారు. జిల్లాకు సత్యసాయి పేరు అలానే ఉంచి.. జిల్లా కేంద్రంగా హిందూపురాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాం" అని బాలకృష్ణ పేర్కొన్నారు.

# విర్రవీగిన వారికి కర్ర కాల్చి వాత పెట్టారు: మంత్రి అచ్చెన్న



శ్రీకాకుళం, ఆగష్టు 16: బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి స్వర్గీయ గౌతు లచ్చన్న పాటుపడ్డారని మంత్రి అచ్చెన్నాయుడు కీర్తించారు. శుక్రవారం నాడు సర్దార్ గౌతు లచ్చన్న 115వ జయంతి. ఈ సందర్భంగా స్థానిక డే అండ్ నైట్ జంక్షన్ వద్ద లచ్చన్న విగ్రహానికి పూల మాలలు వేసి అంజలి ఘటించారు మంత్రి అచ్చెన్నాయుడు. ఈ కార్యక్రమానికి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, టీడీపీ ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసంగించిన మంత్రి అచ్చెన్నాయుడు.. గౌతు లచ్చన్న సేవలను స్మరించుకున్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం లచ్చన్న ఎంతో చేశారని అన్నారు. రైతుల కోసం శ్రీకాకుళం నుంచి చెన్నై వరకు పాదయాత్ర చేశారన్నారు. సిద్ధాంతం కోసం చేసిన వ్యక్తి సర్దార్ గౌతు లచ్చన్న అని కీర్తించారు. గౌతు లచ్చన్నకు కులం లేదు మతం లేదని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఐదుసార్లు ప్రజాప్రతినిధిగా గెలుపొందిన వ్యక్తి లచ్చన్న అని పేర్కొన్నారు. తమలాంటి నాయకులెందరికో లచ్చన్న ఆదర్శం అని మంత్రి చెప్పారు. ఆయన ఆశయ సాధన కోసం నేటి తరం నేతలంతా కలిసి పని చేస్తామని అన్నారు. ఎన్జీ రంగాకు శిష్యుడిగా రాజకీయం చేశారని అన్నారు. ఎన్జీ రంగా కోసం తన పదవినే వదిలేశారన్నారు. అలాంటి సర్దార్ లచ్చన్నను గత ప్రభుత్వం అవమానించిందని మంత్రి అచ్చెన్న ఫైర్ అయ్యారు. అసలు లచ్చన్నకు సర్దార్ బిరుదు ఇవ్వలేదని అన్నారని వైసీపీ నేతలపై మండిపడ్డారు. అలా విర్రవీగిన నేతలకు జిల్లా ప్రజలు కర్ర కాల్చి వాత పెట్టారని మంత్రి వ్యాఖ్యానించారు. తోటపల్లి బ్యారేజ్‌కు సర్దార్ గౌతు లచ్చన్న పేరు పెట్టామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

## దేవియాని పాప.. వ్వాటే కిల్లర్ లుక్

వెండితెరపై స్టార్ హీరోయిన్స్ గా వెలిగిపోవాలని చాలా మంది నటిగా కెరియర్ ఎంచుకుంటారు. ఈ కెరియర్ లో అందం అనేది చాలా ముఖ్యం అని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ముందుగా అందం, ఆకర్షణతో ప్రేక్షకుల దృష్టిలో పడితే తరువాత నటనలో ఉన్న టాలెంట్ చూపించుకుని ఛాన్స్ దొరుకుతుంది. కొంతమంది బ్యూటీస్ స్టార్ హీరోయిన్స్ కాలేకపోయిన నటిగా మాత్రం విమర్శకుల ప్రశంసలు సొంతం చేసుకుంటారు. నటిగా బెస్ట్ పెర్ఫార్మెన్స్ తో మెప్పించే బ్యూటీస్ చాలా తక్కువ మంది కనిపిస్తారు. కథలు, క్యారెక్టర్స్ ని ఎంపిక చేసుకునే విధానం బట్టి అందాల భామల మొదటి ప్రాధాన్యత ఏంటనేది తెలిసిపోతుంది. అలా నటిగా ఈ మధ్యకాలంలో అందరికి చేరువ అయిన ముద్దుగుమ్మ దేవియాని శర్మ. సైతాన్ వెబ్ సిరీస్ లో ఈమె చేసిన బోల్డ్ పెర్ఫార్మెన్స్ కి ప్రతి ఒక్కరు కనెక్ట్ అయ్యారు. దేవయాని శర్మ గురించి సోషల్ మీడియాలో వెతకడం మొదలుపెట్టారు. సేవ్ ది టైగెర్స్ వెబ్ సిరీస్ లో మోడ్రన్ ఐడియాలజీ ఉన్న భార్య క్యారెక్టర్ లో కూడా దేవయాని శర్మ అద్భుతమైన నటనతో ఆకట్టుకుంది.



సైతాన్ లో మాస్ అండ్ బోల్డ్ క్యారెక్టర్ చేసిన దేవయాని సేవ్ ది టైగర్స్ సిరీస్ లో మోడ్రన్ టచ్ లో చూసేసరికి అందరూ షాక్ అయ్యారని చెప్పొచ్చు. తరువాత ఈ బ్యూటీ అనగనగా అనే వెబ్ సిరీస్ తో కెరియర్ స్టార్ట్ చేసింది. తరువాత ఇన్ ది నేమ్ అఫ్ ది గాడ్ వెబ్ సిరీస్ లో నటించింది. ఆకాష్ పూరి రొమాంటిక్ మూవీలో కీలక పాత్రలో నటించింది. అలాగే నవీన్ చంద్ర భానుమతి రామకృష్ణ సినిమాలో కూడా దేవయాని నటించింది. అంజలి లీడ్ రోల్ చేసిన ఝాన్సీ వెబ్ సిరీస్ లో దేవియాని శర్మ చివరగా నటించింది. ఇదిలా ఉంటే ఈ బ్యూటీ ఇన్ స్టాగ్రామ్ లో చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా తన గ్లామర్ ఫోటోలని షేర్ చేస్తూ ఉంటుంది. ఈ ఫోటోలు వైరల్ అవుతాయి. తాజాగా మరో అదిరిపోయే అవుట్ ఫిట్ తో గ్లామరస్ ఫొటోలని ఇన్ స్టాగ్రామ్ లో దేవయాని శర్మ పంచుకుంది. జీన్ షర్ట్ వేసుకొని పైన బటన్స్ తీసేసి సోఫాలో పడుకొని అదిరిపోయే ఫోజులు ఇచ్చింది. ఈ లుక్స్ లో చాలా అందంగా ఉన్నారంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

## 'ఏమైనా అయితే బాధ్యత ఎవరిది సామ్?' గుత్తా, పూనమ్ ఫైర్!

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత మయోసైటిస్ బారినపడి.. దాదాపు ఏడాది పాటు సినిమాలకు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. ఇప్పుడిప్పుడే మళ్లీ బిజీ అవుతోంది. త్వరలోనే సిటాడెల్ వెబ్ సిరీస్ తో సందడి చేయనుంది. తన బర్త్ డే రోజు ఒక కొత్త సినిమాను అనౌన్స్ చేసింది. కానీ ఇప్పటి వరకు ఎలాంటి అప్డేట్ ఇవ్వలేదు. షూటింగ్ మొదలైందో లేదో కూడా ఎవరికీ తెలియదు. దీంతో ఆమె ఇంకా చికిత్స తీసుకుంటుందని టాక్ వినిపిస్తోంది. అయితే సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్ గా ఉంటోంది. ఎప్పటికప్పుడు కొత్త ఫోటో షూట్స్ పోస్ట్ చేస్తూనే.. ఆ మధ్య వివిధ థెరపీల గురించి వివరంగా చెప్పింది. ఫిట్ నెస్ తో పాటు హెల్త్ కు



సంబంధించి పలు టిప్స్ ను తన ఫాలోవర్స్ కోసం పంచుకుంటోంది. ఆ క్రమంలో ఆమె చేసిన ఒక పోస్ట్ వివాదానికి దారి తీసిన విషయం తెలిసిందే. నెబ్యులైజర్ కు సంబంధించి సామ్ పెట్టిన పోస్ట్ పై పలువురు సెలబ్రిటీలు, డాక్టర్లు స్పందించి ఫైర్ అవుతున్నారు. ఇదే సమయంలో ప్రముఖ బ్యాడ్మింటన్ ప్లేయర్, తమిళ హీరో విష్ణు విశాల్ సతీమణి గుత్తా జ్వాల కూడా రెస్పాండ్ అయింది. సమంత పేరును ప్రస్తావించకుండా ఘాటుగా ట్వీట్ చేసింది. "ప్రజలకు హెల్త్ టిప్స్ చెబుతున్న సెలబ్రిటీలను నేను ఒకే ఒక్క ప్రశ్న అడుగుతున్నాను. మీ చికిత్స విధానం అవతలి వారికి ఉపయోగ పడకపోగా చనిపోతే పరిస్థితేంటి?" అని సూటిగా ప్రశ్నించింది. సాయం చేసే ఆలోచన మంచిదేనని చెప్పింది గుత్తా. "కానీ జరగరానిది జరిగితే ఏం చేస్తారు? దానికి మీరు ఏమైనా బాధ్యత వహిస్తారా? మీకు సలహా ఇచ్చిన డాక్టర్ అయినా బాధ్యత తీసుకుంటారా?" అంటూ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా మండిపడింది. అదే సమయంలో హీరోయిన్ పూనమ్ కౌర్.. జ్వాల ట్వీట్ కు రిప్లై ఇచ్చింది. 'ఇది సెల్ఫ్ గ్లోరిఫికేషన్ జ్వాల, ఇదంతా డార్క్ రియాలిటీ' అని పూనమ్ వ్యాఖ్యానించింది. ప్రస్తుతం గుత్తా జ్వాల, పూనమ్ కౌర్ ట్వీట్స్ సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ గా మారాయి.

**అసలేమైంది?** రీసెంట్ గా సమంత.. తాను నెబ్యులైజర్ ను ఉపయోగిస్తున్న ఒక ఫోటోను షేర్ చేసి.. "సాధారణ వైరల్ ఇన్ఫెక్షన్ వచ్చినప్పుడు డిస్టిల్డ్ వాటర్ లో హైడ్రోజన్ పెరాక్సైడ్ కలిపి నెబ్యులైజ్ చేయండి" అని సలహా ఇచ్చింది. అయితే అలా చేస్తే ప్రాణాలకు చాలా ప్రమాదమని తెలిపారు కొందరు వైద్యులు. దీంతో ఆ విషయం సోషల్ మీడియాలో వైరల్ గా మారగా.. అనేక మంది స్పందిస్తున్నారు. మరి ఈ వివాదం నుంచి సామ్ ఎలా బయటపడుతుందో చూడాలి.




## పుష్ప 2 వాయిదా.. వారి మంచికే..




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న పుష్ప ది రూల్ సినిమాని ఆగష్టు 15కి రిలీజ్ చేయాలని అనుకున్నారు. దేశ వ్యాప్తంగా భారీ అంచనాలు ఈ సినిమాపై క్రియేట్ అయ్యి ఉన్నాయి. నార్త్ ఇండియన్ ఆడియన్స్ కూడా పుష్ప 2 కోసం ఎగ్జైటింగ్ గా ఎదురుచూస్తున్నారు. అయితే మూవీ షూటింగ్ ఇంకా కంప్లీట్ కాకపోవడంతో ఆగష్టు 15 అనుకున్న రిలీజ్ డేట్ వాయిదా పడింది. డిసెంబర్ 6న పుష్ప ది రూల్ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకి తీసుకొని రాబోతున్నట్లు నిర్మాణ సంస్థ ప్రకటించింది. ఈ సినిమా బిజినెస్ కూడా ఆల్ మోస్ట్ అన్ని భాషలలో కంప్లీట్ అయిపోయింది. నార్త్ ఇండియాలో ఈ సారి 200 కోట్లకు పైనే కలెక్షన్స్ ని పుష్ప 2 అందుకుంటుందని అంచనా వేశారు. అలాగే 1000 కోట్ల క్లబ్ లో ఈ చిత్రం చేరుతుందని ట్రేడ్ పండితులు కూడా భావించారు. ఈ సినిమాపైనే బిజినెస్ 400 కోట్ల వరకు జరిగిందని టాక్ వినిపిస్తోంది. ఇంత హెవీ ఎక్స్ పెక్టేషన్స్ ఉన్న సినిమా థియేటర్స్ లోకి వస్తే పబ్లిక్ అటెన్షన్ అంతా కూడా పుష్ప ది రూల్ మీదనే ఉండేది. దీంతో కచ్చితంగా మిగిలిన హీరోలు ఎవరు కూడా పుష్ప2కి పోటీగా వచ్చే సాహసం చేసేవారు కాదు. అయితే ఈ సినిమా వాయిదా పడటంతో తెలుగు, తమిళ్, హిందీ భాషలలో ఏకంగా 9 సినిమాలకి లైన్ క్లియర్ అయ్యిందని చెప్పాలి. తెలుగులో డబుల్ ఇస్మార్ట్, మిస్టర్ బచ్చన్, ఆయ్ చిత్రాలు మూడు పుష్ప 2 వాయిదా అని కన్ఫర్మ్ అయ్యాక ఆగష్టు 15 రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకున్నాయి. హిందీలో జాన్ అబ్రహం వేదా, అక్షయ్ కుమార్ ఖేల్ ఖేల్ మే, రాజ్ కుమార్ రావు స్త్రీ 2 సినిమాలని కూడా పుష్ప 2 రిలీజ్ పై క్లారిటీ వచ్చిన తర్వాత ఇండిపెండెంట్స్ కి ప్రేక్షకుల ముందుకి తీసుకురావాలని నిర్మాతలు డిసైడ్ అయ్యారు. తమిళంలో తంగలాన్ సినిమా అయితే ఆగష్టు 15 రిలీజ్ డేట్ అని ముందే కన్ఫర్మ్ అయ్యింది. పుష్ప 2 రిలీజ్ అయిన కూడా ఆ చిత్రాన్ని పోటీగా దించాలని అనుకున్నారు. ఒకవేళ ఈ రెండు పోటీ పడి ఉంటే తమిళంలో పుష్ప 2కి కొంత కలెక్షన్స్ తగ్గే ఛాన్స్ ఉండేది. అయితే పుష్ప 2 వాయిదా పడటం వలన ఏకంగా 9 సినిమాలని ఇండిపెండెంట్స్ సందర్భంగా ప్రేక్షకులు చూడగలుగుతున్నారు. వీటిలో ఏ మూవీ పబ్లిక్ కి కనెక్ట్ అయితే దానికి లాంగ్ వీకెండ్ ఉపయోగపడుతుందని సినీ విశ్లేషకులు అంటున్నారు.

## ఆ బారమంతా దేవరపైనే...



థియేటర్స్ లో భారీగా ప్రేక్షకులని రప్పించగల సినిమాలు గత కొంతకాలం నుంచి బాగా తగ్గిపోయాయి. పెద్ద సినిమాలు వస్తున్న కూడా ప్రేక్షకులని మెప్పించడంలో విఫలం అవుతున్నాయి. స్టార్ హీరోల నుంచి ఏడాదికి ఒక సినిమా రావడం గగనం అయిపోయింది. డిజిటల్ ఎక్స్ పీరియన్స్ కి అలవాటు పడిన ప్రేక్షకులు సినిమా ఏవరేజ్ గా ఉందనే టాక్ వస్తే చూడటానికి ఇష్టపడటం లేదు. ఓటీటీలో రిలీజ్ అయ్యాక చూసుకోవచ్చనే ధీమాతో ఉంటున్నారు. సూపర్ హిట్ టాక్ వస్తేనే తప్ప థియేటర్స్ కి ఆడియన్స్ రావడం లేదు.

చిన్న సినిమాలు సూపర్ హిట్ అయిన కూడా ఒకేసారి భారీ ఎత్తున ప్రేక్షకులని థియేటర్స్ కి రప్పించలేవు. మౌత్ టాక్ తో మెల్లగా ఈ సినిమాలు జనాల్లోకి వెళ్తాయి. అలాగే పబ్లిక్ కూడా వీకెండ్ లోనే సినిమా చూసేయాలనే ఇంటెన్షన్ తో ఉండరు. నిలకడగా ఈ సినిమాలకి కలెక్షన్స్ వస్తాయి. అయితే మాస్ అప్పీల్ ఉన్న కథలు ప్రేక్షకుల ముందుకొస్తే క్రౌడ్ ని పెద్ద ఎత్తున థియేటర్స్ లోకి రప్పించగలవు. సూపర్ హిట్ అనే మౌత్ టాక్ వస్తేనే ఆ సినిమాలు క్రౌడ్ పుల్లర్స్ గా మారుతాయి. ఈ ఏడాది అలా మాస్ అప్పీల్ తో స్టార్ హీరోల నుంచి రెండు సినిమాలు మాత్రమే థియేటర్స్ లోకి వచ్చాయి. అవి సూపర్ స్టార్ మహేష్ బాబు గుంటూరు కారం, ప్రభాస్ కల్కి. వీటిలో గుంటూరు కారం ప్రేక్షకులని మెప్పించలేకపోయింది. దీంతో హనుమాన్ మూవీ మంచి టాక్ తో క్రౌడ్ పుల్లర్ చిత్రంగా మారింది. గత నెల రిలీజ్ అయిన కల్కి 2898ఏడీ సినిమా సూపర్ హిట్ టాక్ తో భారీగా ప్రేక్షకులని థియేటర్స్ కి రప్పించింది. తెలుగుతో పాటు హిందీలో కూడా ఈ సినిమా పబ్లిక్ ని ఎట్రాక్ట్ చేసి థియేటర్స్ కి వచ్చేలా చేసింది. తాజాగా రామ్ పోతినేని డబుల్ ఇస్మార్ట్, రవితేజ మిస్టర్ బచ్చన్ సినిమాలలో ఒకటైన ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుందని సినీ విశ్లేషకులు ఎక్స్ పెక్ట్ చేశారు. అయితే ఈ రెండింటికి మిక్స్డ్ టాక్ వస్తోంది. ఇవి ఎంత వరకు క్రౌడ్ ని థియేటర్స్ కి తీసుకొని రాగలవనేది వేచి చూడాలి. నెక్స్ట్ రాబోయే సినిమాలలో చూసుకుంటే దేవర సినిమాకి మాత్రమే పెద్ద ఎత్తున ప్రేక్షకులు థియేటర్స్ కి రప్పించే సత్తా ఉంది. ఈ మూవీ మాస్ బొమ్మగా రాబోతోంది. ఆర్ఆర్ఆర్ సినిమా బ్లాక్ బస్టర్ తో నార్త్ లో కూడా జూనియర్ ఎన్టీఆర్ క్రేజ్ పెరిగింది. తెలుగు రాష్ట్రాలతో పాటు హిందీలో కూడా డిస్ట్రిబ్యూటర్స్, బయ్యర్లకి అతి పెద్ద హోప్ గా దేవర మూవీ కనిపిస్తోంది. ఈ సినిమా నుంచి వచ్చిన సాంగ్స్ అయితే మూవీకి మంచి హైప్ తీసుకొచ్చాయి. నెక్స్ట్ చిత్ర యూనిట్ నుంచి రాబోయే మూవీ టీజర్, ట్రైలర్ ఉండబోతున్నాయి అనే దానిపై పబ్లిక్ అటెన్షన్ ఉంటుంది. కొరటాల శివ ఆచార్య లాంటి డిజాస్టర్ తర్వాత దేవర మూవీ చేస్తున్నారు. దీంతో ఫ్యాన్స్ లో కూడా ఒకింత టెన్షన్ అయితే ఉంది. కానీ కంటెంట్ ని ప్రెజెంట్ చేసే పోస్టర్స్, గ్లింప్స్ అయితే సినిమా మీద నమ్మకం పెంచుతున్నాయి. మరి దేవర మూవీ ఏ మేరకు ఈ ఏడాది క్రౌడ్ పుల్లర్ గా మారుతుందనేది వేచి చూడాలి.

## శర్మా గాళ్ ఇన్నర్ అందాలు కిల్లింగ్

శర్మా సిస్టర్స్ గురించి పరిచయం లేదు. నేహాశర్మ- ఐషా శర్మ సోషల్ మీడియాల్లో ఎంతో యాక్టివ్ గా ఉంటారు. నిరంతర ఫోటో- వీడియో ట్రీట్ లో సిస్టర్స్ ని కొట్టే వాళ్లేలేరు. తన సోదరి ఐషా శర్మ అంటే నేహాకు ఎంతో ప్రేమ, అభిమానం. దానికి తగ్గట్టుగానే ఇప్పుడు తన బర్త్ డే సందర్భంగా నేహా శర్మ స్నేహితులందరికీ పార్టీ ఇచ్చింది. ఈ పార్టీ నుంచి అదిరిపోయే ఫోటోలను సోషల్ మీడియాల్లో షేర్ చేసింది. అయితే ఈ ఫోటోల్లో నేహా సంథింగ్ స్పెషల్ గా కనిపిస్తోందంటూ కితాబు అందుకుంటోంది. శర్మా గాళ్స్ సందర్భాన్ని బట్టి దేశ విదేశాల్లో సెలబ్రేషన్స్ ప్లాన్ చేస్తుంటారు. గతంలో బర్త్ డే పార్టీ కోసం విదేశాలకు వెళ్లారు. అందుకు సంబంధించిన ఫోటోలు ఇంటర్నెట్ లో వైరల్ అయ్యాయి. కానీ ఈసారి ట్రిప్ ఎక్కడి నుంచి అన్నది వెల్లడించలేదు. కానీ ఇంతలోనే ఇప్పుడు ఈ మనోహరమైన



ఫోటోలతో అభిమానుల గుండెల్లో కొలువు దీరింది. నేహా టూ హాలి గా ఉందంటూ అభిమానులు కామెంట్ చేస్తున్నారు. కొందరు ఇలాంటి బర్త్ డే పార్టీలతో కాకుండా నేరుగా సినిమాలతో ఫ్యాన్స్ ముందుకు రావాలని కోరుతున్నారు. ఇప్పటికి నేహా స్పెషల్ ఫోటోని అంతర్జాలంలో వైరల్ గా షేర్ చేస్తున్నారు. కెరీర్ మ్యాటర్ కి వస్తే నేహా శర్మ ఓవైపు సినిమాలు, మరోవైపు వెబ్ సిరీస్ లలో నటిస్తోంది. నేహా శర్మ నటించిన పాత లఘుచిత్రం – కృతి ఇప్పుడు నెట్ లో వైరల్ గా మారింది. 19 నిమిషాల థ్రిల్లర్ ఆద్యంతం రక్తి కట్టిస్తోంది. దర్శకుడు కుందర్ తెలివిగా తన ఆలోచనలను మిక్స్ చేసి స్పష్టమైన కథను నేరేట్ చేశాడు. ఇది హారర్ థ్రిల్లర్.. బలమైన పాత్రలతో అందరినీ ఆకట్టుకుంది.

## సైలెంట్‌గా ఆ పనికి రెడీ అయిన ప్రేమలు బ్యూటీ.. షాక్‌లో ఫ్యాన్స్

గత కొద్ది కాలంగా ఇండస్ట్రీతో సంబంధం లేకుండా అన్ని భాషల చిత్రాలకు ఆదరణ పెరుగుతోంది. మరీ ముఖ్యంగా టాలీవుడ్‌లో మలయాళం సినిమాలకు క్రేజ్ ఎక్కువగా కనిపిస్తుంది. కంటెంట్ సాలిడ్‌గా ఉంటే ప్రేక్షకులు భాషతో సంబంధం లేకుండా సినిమాకు ఎక్కే కనెక్ట్ అయిపోతున్నారు. రీసెంట్ గా ఎన్నో మలయాళం సినిమాలు తెలుగు ప్రేక్షకులను బాగా అలరించాయి. అలా తెలుగు ప్రేక్షకుల మనసు దోచుకున్న చిత్రాలలో ప్రేమలు కూడా ఒకటి. ఈ మూవీలో హీరోయిన్ గా చేసిన మమితా బైజు తన క్యూట్ లుక్స్‌తో కుర్ర కారును ఫిదా చేసింది. ఈ మూవీలో ఆమె నటనకు పడిపోయిన యువత ఇలాంటి గర్ల్ ఫ్రెండ్ మనకు కూడా ఉంటే బాగుంటుంది అని కలలు కన్నారు. ఏ మూవీ చూసిన తర్వాత ఈ బ్యూటీ వివరాలు



కనుక్కోవడానికి నెటిజన్స్ ఎంతో ఆసక్తి కనబరిచారు. గూగుల్.లో ఈమెకు సంబంధించిన వివరాల కోసం సర్చింగ్ విపరీతంగా జరిగింది. అందం.. అభినయం కలగలిపిన ఈ బ్యూటీ తన నటనతో తెలుగింటి ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. షార్ట్ ఫిలిమ్స్ తో తన కెరీర్ ప్రారంభించిన మమితా బైజు.. సినీ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది. 2017లో సర్వోపరి పాలక్కారన్‌తో ఆమె సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఖోఖో చిత్రంలో ఆమె నటనకు ఉత్తమ సహాయ నటి అవార్డు కూడా లభించింది. ప్రేమలు మూవీ తర్వాత ఈ ముద్దుగుమ్మ తెలుగు సినిమాల్లో ఎప్పుడూ నటిస్తుందా అని టాలీవుడ్ అభిమానులు ఎదురు చూశారు. అందరూ ఆశించినటే అతి త్వరలో మమితా బైజు తెలుగు సినిమాలతో ప్రేక్షకులను పలకరించబోతోంది . అది కూడా మామూలు స్టార్ సినిమాతో కాదు.. బుచ్చిబాబు, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కాంబినేషన్‌లో వస్తున్న సరికొత్త చిత్రంలో నటించబోతోంది. రౌడీ హీరో విజయ్ దేవరకొండతో కూడా ఓ సినిమాలో ఈమె చేస్తున్నట్లు టాక్. అయితే ప్రస్తుతం ఈ బ్యూటీకి సంబంధించి మరొక వార్త ఆమె అభిమానులను ఆశ్చర్యపరుస్తోంది. ఓ స్టార్ హీరో సినిమాలో మమితా బైజు స్పెషల్ సాంగ్ చేయబోతోంది అని టాక్ వినిపిస్తుంది. కెరీర్ ప్రారంభ దశలోని ఇంత బోల్డ్ డెసిషన్ తీసుకోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు ఆమె అభిమానులు. మరికొందరు ఇది ఫేక్ న్యూస్ అని అంటున్నారు. ఈ విషయంపై క్లారిటీ త్వరలోనే తెలుస్తుంది.



# హసీనా విషయంలో అమెరికాకు భారత్ రిక్వెస్ట్

బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాను అధిక ఒత్తిడికి గురిచేయొద్దని ఏడాది క్రితం భారత్ అధికారులు అమెరికాను కోరినట్లు తెలుస్తోంది. అక్కడి అధికారులను ఉటంకిస్తూ ఈమేరకు కథనాన్ని వాషింగ్టన్ పోస్టు పత్రిక ప్రచురించింది. 2024 జాతీయ ఎన్నికలకు ముందు బంగ్లాదేశ్ పలువురిని జైళ్లలో వేయడాన్ని ఉద్దేశించి అమెరికా దౌత్యవేత్తలు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. అదే సమయంలో అమెరికా ప్రభుత్వం కూడా బంగ్లాదేశ్‌కు చెందిన ఓ పోలీస్ విభాగంపై ఆంక్షలు విధించింది. ఇది అవామీ అధినేత కింద పనిచేస్తుందనే ఆరోపణలున్నాయి. ఇక బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యం అణచివేతకు, మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడేవారిపైనా ఆంక్షలు విధిస్తామని కూడా హెచ్చరించింది.

ఈనేపథ్యంలో భారత అధికారులు వరుసగా అమెరికాతో చర్చలు జరిపారు. హసీనా విషయంలో మరీ కఠినవైఖరిని అవలంభించొద్దని కోరినట్లు వాషింగ్టన్ పోస్టు పేర్కొంది. అక్కడి ప్రతిపక్షాలు బలపడితే ఆ దేశం ఇస్లామిక్ అతివాద శక్తుల కేంద్రంగా మారుతుందని న్యూఢిల్లీ ఆందోళన వ్యక్తంచేసినట్లు వెల్లడించింది. అంతిమంగా అది భారత్ జాతీయ భద్రతకు సవాళ్లను విసురుతుందని అమెరికాకు వెల్లడించింది. ఈవిషయంపై "మీరు ప్రజాస్వామ్యం పేరిట చర్యలు చేపడతారు. అది మాకు చాలా తీవ్ర అంశంగా మారి అస్తిత్వానికి ముప్పు అవుతుంది" అని కొందరు భారతీయ అధికారులు తమ వద్ద వ్యాఖ్యానించినట్లు ఆ పత్రిక వెల్లడించింది. వ్యూహాత్మక ఏకాభిప్రాయం లేకపోతే.. వ్యూహాత్మక భాగస్వామి కూడా కాలేరని భారత అధికారి పేర్కొన్నట్లు వెల్లడించింది. ఆ తర్వాత నుంచి బైడెన్ కార్యవర్గం నాటి బంగ్లా ప్రధాని హసీనా, ఆమె అధికారులపై ఆంక్షల విషయంలో కొంత మెతక వైఖరి అవలంభించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో పరిస్థితి దారి తప్పిందా అనే విషయంపై భారత్–అమెరికాలు విశ్లేషించుకొన్నట్లు వాషింగ్టన్ పోస్టు పేర్కొంది. కొన్ని విషయాల్లో అమెరికా ప్రజల అంచనాలకు భిన్నంగా ఉన్న భాగస్వాములతో కలిసి పనిచేయాల్సి ఉంటుందని ఓ అమెరికా అధికారి వ్యాఖ్యానించినట్లు వెల్లడించింది. బంగ్లాదేశ్‌లో క్షేత్రస్థాయిలో పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉంటాయని పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో ఎన్నికలకు ముందే హసీనా విషయంలో కఠిన వైఖరిని అవలంభించాలని అక్కడి అమెరికా రాయబారి పీటర్‌హాస్ వంటి వారు కోరారు. ఈ ఏడాది జనవరిలో బంగ్లాదేశ్ ఎన్నికలు జరిగాయి. దీనిని ప్రధాన ప్రతిపక్షమైన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) బహిష్కరించింది. ఆ తర్వాత ఈ ఎన్నికలను సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించింది. అమెరికా విదేశాంగ శాఖ మాత్రం ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా సాగలేదని ఆరోపించింది. ఇది నాలుగోసారి ఎన్నికైన హసీనా ప్రభుత్వానికి ఇబ్బందికరంగా పరిణమించింది. కొన్ని నెలలు మౌనంగా ఉన్న హసీనా మే నెలలో ఓ సంచలన ప్రకటన చేశారు. బంగ్లాదేశ్‌లో వైమానిక స్థావరం ఏర్పాటుచేసుకోవడానికి ఒక దేశానికి అనుమతిస్తే.. తన ఎన్నిక సాఫీగా జరిగేటట్లు చేస్తానని ఆఫరిచ్చిందన్నది దాని సారాంశం. ఈ ప్రకటన ఒక్కసారిగా ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. అమెరికానే ఆ దేశం అయి ఉంటుందనే ప్రచారం జరిగింది. తాజాగా వాషింగ్టన్ పోస్టు కథనం హసీనా సర్కార్‌కు అమెరికాకు సంబంధాలు అంత సాఫీగా లేవనే విషయాన్ని చెబుతోంది.




# జనగామ బీఆర్ఎస్‌లో భగ్గుమన్న వర్గపోరు..

జనగామ: జనగామ బీఆర్ఎస్‌లో వర్గపోరు మళ్లీ రాజుకుంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వేళ మొదలైన వేడి ఇంకా చల్లారలేదు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి వర్గాల మధ్య పచ్చగడి వేస్తే భగ్గమంటుంది. తాజాగా ఎమ్మెల్సీ పోచంపల్లి పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను పల్లా వర్గీయులు చింపేశారంటూ పోచంపల్లి అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ నేత జోలికి వస్తే ఊరుకునేది లేదంటూ హెచ్చరిస్తున్నారు. పల్లా వర్గం వారు ఇకనైనా ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని హితవు పలికారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆశించి శ్రీనివాస్ రెడ్డి భంగపడ్డారు. అధిష్ఠానం పల్లాకే సీటు కేటాయించింది. అప్ప ట్నుంచి ఇరు వర్గాల మధ్య పోరు మొదలైంది. నియోజకవర్గంలో నువ్వా నేనా అన్నట్లు వ్యవహారం నడుస్తోంది. ఇద్దరు నేతలూ జనగామలో తమ ఆధిపత్యం కాపాడుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఎన్నికల సందర్భంగా మొదలైన వివాదం ఇప్పటికీ సద్దుమణగలేదు. పల్లా, పోచంపల్లి వర్గాలుగా చీలిపోయిన కార్యకర్తలు, నేతలు ఎప్పుడు ఎవరిపై ఎవరు దాడులు చేసుకుంటారో అని నియోజకవర్గ ప్రజల్లో ఆందోళన నెలకొంది. అయితే వివదాన్ని బీఆర్ఎస్ అగ్రనాయకత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుంటే మంచిదని పలువురు రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తర్వాత నియోజకవర్గ స్థాయిలో ఇలాంటి పరిణామాలు మంచిది కాదని ఆ పార్టీ నేతలే పలువురు చర్చించుకుంటున్నారు. వర్గపోరు పక్కన పెట్టి పార్టీ బలోపేతానికి కృషి చేస్తే బాగుంటుందని సలహాలు ఇస్తున్నారు. మరోపైపు మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మాత్రం ఈ వివాదానికి దూరంగా ఉంటున్నారు.

# కొడంగల్ రైతులను అడుగుదాం పదా.. రేవంత్‌కు కేటీఆర్ సవాల్



హైదరాబాద్: దేశంలోనే అతి పెద్ద మోసం కాంగ్రెస్ సర్కార్ చేసిన రైతు రుణమాఫీ అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావు విమర్శించారు. రుణమాఫీ పేరుతో చేసిన మోసాన్ని కప్పిపుచ్చుకునేందుకు రేవంత్ రంకెలు వేస్తున్నారని అన్నారు. తెలంగాణలో అప్పులు తీసుకున్న రైతుల్లో సగం మందికి కూడా రుణమాఫీ కాలేదని తెలిపారు. ఒకేసంతకంతో డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని మాట తప్పారని విమర్శించారు. తొలుత రూ.40 వేల కోట్లతో మాఫీ అంచనాలు వేసి ఇప్పుడు కేవలం రూ. 27 వేల కోట్లకే పరిమితం చేయడం ఏంటని కేటీఆర్ ప్రశ్నించారు. జులై రాగానే లబ్ధిదారుల్లో సగానికిపైగా రైతులకు కోత విధించి మాఫీ అమలు చేశారని అన్నారు. "31వేల కోట్లు రుణమాఫీ అని కేబినెట్ తీర్మానం చేశారు. అమలులో ఆంక్షలు, కోతలు పెట్టారు. సీఎం అంటే కటింగ్ మాస్టర్ అన్నట్లుగా రేవంత్ పరిస్థితి ఉంది. 60శాతం రైతులకు ఎగ్గొట్టి 40శాతం రుణమాఫీ చేసి వంద శాతం చేశామని చెబుతున్నారు. అంకెలు మార్చి రంకెలు వేస్తున్నారు. కేసీఆర్‌పై ద్వేషం సకల జనులకు మోసం ఇది రేవంత్ విధానం. నిన్నటి వరకు 17, 934 కోట్లు మాత్రమే రుణమాఫీ జరిగింది. 22 లక్షల 37 వేల 840 మందికి మాత్రమే రుణమాఫీ అయింది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడూ రుణమాఫీ చేశాం, రైతుబంధు ఇచ్చాం. ఆ రెండు పథకాలకుగానూ మా ప్రభుత్వం రైతుల కోసం రూ.లక్ష కోట్లు వెచ్చించింది. కాంగ్రెస్ ఇచ్చింది కేవలం 17వేల కోట్లే. వానా కాలానికి ఇవ్వాల్సిన రైతు బంధు ఇవ్వలేదు. రేవంత్ సోదరుడు కొండల్ రెడ్డి పర్యటన సక్సస్ అయింది. రేవంత్ పర్యటన విజయవంతం కాలేదు. ఆ కోపంతోనే రేవంత్ రంకెలు వేస్తున్నట్లు ఉంది" అని కేటీఆర్ పేర్కొన్నారు.

**రైతులను అడుగుదాం పదా..** "సీఎం రేవంత్ రెడ్డి భద్రత లేకుండా కొడంగల్ నియోజక వర్గానికి రావాలి. నేనూ వస్తా. ఒక్క ఊర్లో వంద శాతం రుణమాఫీ జరిగిందని రైతులు చెబితే అక్కడే నేను రాజీనామా చేస్తా. రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటా. దమ్ముంటే నా సవాల్‌ని స్వీకరించు. రుణమాఫీ పూర్తిగా చేయకుండానే సంపూర్ణంగా మాఫీ చేశామని చెప్పడం దిగజారుడుతనం. రైతులను మోసం చేసిన సీఎంపై చీటింగ్ కేసు పెట్టాలి. రేవంత్ మానసిక స్థితిపై నాకు అనుమానం ఉంది. ఆయనకు ఏదో అయినట్టుంది. ఆయన్ను ఎక్కడైనా చూపించాలని వారి కుటుంబ సభ్యులకు విన్నవిస్తున్నా. రుణమాఫీ, ఆరు గ్యారంటీలు అమలు చేయాలని హరీష్ రావు అన్నారు. రాజీనామా చేయాలని కొందరు సన్నాసులు హరీష్ ఫ్లెక్సీలు పెట్టారు. 8 నెలల్లో 19సార్లు ఢిల్లీకి వెళ్లడం రేవంత్ రికార్డు. కేసీఆర్ పదేళ్ల కాలంలో కూడా 19సార్లు ఢిల్లీకి వెళ్లలేదు. ఒక్క మహబూబ్ నగర్ జిల్లాలోనే ఇంకా లక్షమంది రైతులు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. సీఎం జిల్లాలో 41 శాతం, డిప్యూటీ సీఎం జిల్లాలో 30శాతం మాత్రమే రుణమాఫీ జరిగింది. గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరిస్తం. ప్రభుత్వానికి, గవర్నర్ వివరాలు ఇస్తాం. అవసరమైతే కోర్టుకు వెళతాం" అని కేటీఆర్ అన్నారు.

# 2027 నాటికి భారత్ మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్: గీతా గోపీనాథ్



భారత్ ఆర్థికంగా అంచనాలకు మించి అభివృద్ధి చెందుతోందని అంతర్జాతీయ ద్రవ్యనిధి ఫస్ట్ డిప్యూటీ ఎండీ గీతా గోపీనాథ్ అభిప్రాయపడ్డారు. ఆమె తాజాగా ఆంగ్లపత్రిక ఇండియాటుడేకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ వృద్ధి వేగానికి వేర్వేరు కారణాలున్నాయన్నారు. 2027 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ఆమె అంచనా వేశారు. "గత ఆర్థిక సంవత్సరంలో అంచనాల కంటే మెరుగైన వృద్ధి రేటును భారత్ నమోదు చేసింది. దానిని కొనసాగించేందుకు తీసుకొనే చర్యలు ఈ ఏడాది మా అంచనాలను ప్రభావితం చేస్తాయి.

దీంతోపాటు దేశంలో ప్రైవేటు వ్యయాలు కూడా బాగా పుంజుకొన్నట్లు మేం గమనించాం" అని గీతా వెల్లడించారు. "గతేడాది ప్రైవేటు వ్యయాల వృద్ధి 4 శాతం మాత్రమే ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యయాలు కోలుకొని పెరిగేకొద్దీ ఇది కూడా వృద్ధి చెందుతుంది. ద్విచక్ర వాహనాల విక్రయాలు, ఎఫ్‌ఎంసీజీ విక్రయాలు బాగా పుంజుకొన్నాయి. దీనికి వర్షాలు కూడా తోడవటంతో మంచి పంట ఉత్పత్తి సాధ్యమవుతుంది. ఫలితంగా వ్యవసాయ ఆదాయం పెరిగి గ్రామీణ వినిమయం పుంజుకొంటుంది. మా అంచనాలకు మూలాలు ఇవే" అని ఐఎంఎఫ్ డిప్యూటీ డైరెక్టర్ వెల్లడించారు. భారత్‌లో ఎఫ్‌ఎంసీజీ, ద్విచక్ర వాహన విక్రయాలు, అనుకూలమైన వర్షాల డేటా ఆధారంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఐఎంఎఫ్ భారత వృద్ధిరేటు అంచనాలను 7శాతానికి పెంచింది. ఈ ఏడాది ఆర్థిక సర్వేలో ప్రభుత్వం ఇచ్చిన 6.5 శాతం కంటే ఇది అధికం కావడం గమనార్హం.

# కవిత బెయిల్‌కు.. భాజపాకి ఏంటి సంబంధం?: కేంద్రమంత్రి బండి సంజయ్



హైదరాబాద్: త్వరలోనే కాంగ్రెస్‌లో భారాస విలీనం అవుతుందని భాజపా నేత, కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. కేసీఆర్‌కు ఏఐసీసీ, కేటీఆర్‌కు పీసీసీ, కవితకు రాజ్యసభ సీటు ఖాయమన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. "పొత్తు పెట్టుకొని పదువులు పంచుకున్న చరిత్ర కాంగ్రెస్, భారాసది. కవిత బెయిల్‌కు.. భాజపాకి ఏం సంబంధం? భారాసను విలీనం చేస్తే బెయిల్ వస్తుందనడం మూర?త్వం. కవిత బెయిల్ విషయంలో కావాలనే భాజపాపై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోంది. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో కేసీఆర్, కేటీఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయట్లేదు?"అని బండి సంజయ్ ప్రశ్నించారు.

**భాజపాలో భారాస విలీనం ఊహాజనితం: ఈటల** – భాజపాలో భారాస విలీనంపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై భాజపా నేత, ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. అదంతా నిజం కాదని, ఊహాజనితమని అన్నారు. అది కాంగ్రెస్ విషప్రచారమని మండిపడ్డారు. అది జరగదని, భాజపాలో అలాంటి చర్చ ప్రస్థావనే లేదని తెలిపారు. రుణమాఫీ పూర్తిగా జరిగిందన్న ప్రభుత్వం ప్రకటన బోగస్ అన్నారు. రుణమాఫీ రూ. 72వేల కోట్లు ఉండగా.. విధివిధానాల పేరుతో రూ.34వేల కోట్లకు కుదించారని ఆరోపించారు. హైడ్రా పేరుతో జరుగుతోన్న హైడ్రామాను ఆపాలని, అక్రమ కట్టడాల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నామని చెప్పుకొంటున్న ప్రభుత్వం.. చిత్తశుద్ధి ఉంటే నిర్మాణాలు జరగకుండా చూడాలని అన్నారు.

# నా అక్కాచెల్లెళ్లను కించపరిచే ఉద్దేశం ఎప్పుడూ లేదు: కేటీఆర్



హైదరాబాద్: ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి సంబంధించి తాను చేసిన వ్యాఖ్యలపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. ఇందుకు సంబంధించి ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. "పార్టీ సమావేశంలో యథాలాపంగా చేసిన వ్యాఖ్యల వల్ల మా మహిళా సోదరీమణులకు మనస్తాపం కలిగితే, నేను విచారం వ్యక్తం చేస్తున్నాను. నా అక్కాచెల్లెళ్లను కించపరిచే ఉద్దేశం ఎప్పుడూ లేదు' అని కేటీఆర్ తెలిపారు.

**అసలేం జరిగిందంటే..** ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై కేటీఆర్ తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బస్సుల్లో అల్లం– వెల్లుల్లి, కుట్లు, అల్లికలు చేసుకుంటే తప్పేంటన్న మంత్రి సీతక్క వ్యాఖ్యలపై స్పందించారు. "బస్సుల్లో కుట్లు, అల్లికలు మేం వద్దనట్లేదు. అవసరమైతే బ్రేక్ డ్యాన్స్‌లు వేసుకున్నా మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. బస్సుల్లో సీట్ల కోసం ప్రయాణికులు తన్నుకుంటున్నారు. ఆర్టీసీ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. బస్సుల సంఖ్య పెంచాలని కోరుతున్నాం" అని కేటీఆర్ అన్నారు. మరోవైపు భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ వ్యాఖ్యలను తెలంగాణ మహిళా కమిషన్ సుమోటోగా తీసుకుంది. మహిళల పట్ల కేటీఆర్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్టు మహిళా కమిషన్ అభిప్రాయపడింది. తెలంగాణ మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు ఉన్నాయని కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద 'ఎక్స్'లో పోస్టు చేశారు.

# దాడి జరిగితే ఆరు గంటల్లోపు కేసు పెట్టండి: ఆసుపత్రులకు కేంద్ర ఆరోగ్యశాఖ ఆదేశాలు



దిల్లీ: పశ్చిమబెంగాల్ హత్యాచార ఘటనను నిరసిస్తూ చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో ఆర్‌జీ కర్ ఆసుపత్రిలో కొందరు దుండగులు విధ్వంసం సృష్టించారు. దీనిని కేంద్రప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈనేపథ్యంలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు శుక్రవారం ఆదేశాలు ఇచ్చింది.

ఆసుపత్రి ప్రాంగణం లేక సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలపై దాడి జరిగిన ఆరు గంటల్లోపు పోలీసులు కేసు పెట్టాలని చెప్పింది. నిర్ణీత గడువులోగా ఫిర్యాదు అందకపోతే.. సంబంధిత ఆసుపత్రి హెడ్ దానికి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

# ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేసిన కోదండరాం, అలీ ఖాన్..



హైదరాబాద్: తెలంగాణ జనసమితి అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం, సియాసత్‌లో న్యూస్ ఎడిటర్ అమీర్ అలీ ఖాన్‌లు ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా ఎన్నికైన కోదండరాం, అలీ ఖాన్‌లతో తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. కాగా, ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్సీ కావడానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్సీ కావడంతో తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఎమ్మెల్సీ తనకు పదవి కాదని.. సేవ అని పేర్కొన్నారు. అమరుల ఆకాంక్షలు నెరవేర్చడానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. అందరం కలిసి పని చేయడం ద్వారా ప్రజల సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. తనకు చేతనైన కాడికి ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చేందుకు పని చేస్తానని అన్నారు ప్రొఫెసర్ కోదండరాం.

**మంత్రి పదవా? నాకు తెలియదు..** తానేమీ కత్తి పెట్టి బెదిరించి ఎమ్మెల్సీ తీసుకోలేదని కోదండరాం అన్నారు. ఎమ్మెల్సీ అవగానే తనకేమీ కొమ్ములు రాలేదన్నారు. తన ఆలోచనలు అస్సలు మారలేదన్నారు. అధికారం అనుభవించడానికి తాను ఎమ్మెల్సీ కాలేదని.. ఇది ఒక కొత్త అనుభవం అని పేర్కొన్నారు. ఇప్పుడున్న యంత్రాంగంలో చేరి ఎలా పని చేయాలో ఆలోచిస్తున్నానని అన్నారు. ఎమ్మెల్సీ అనేది ఒక అవకాశం అని.. మరింత సేవ చేయడానికి దీన్ని ఉపయోగిస్తానని కోదండరాం చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ విమర్శలను తాను పట్టించుకోనని అన్నారు. ప్రజలు అడిగిన వాటికి తాను సమాధానం చెప్తానని అన్నారు. గతంలో ఎలా ఉన్నానో.. ఇప్పుడూ.. ఎప్పుడూ అలాగే ఉంటానని అన్నారు. ఇక తనను మంత్రివర్గంలోకి తీసుకుంటున్నారని వస్తున్న వార్తలపై ప్రొఫెసర్ కోదండరాం స్పందించారు. ఈ ప్రచారాలకు తాను సమాధానం చెప్పలేనని అన్నారు. ఇక తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి అమీర్ అలీ ఖాన్ ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చేలా కృషి చేస్తానన్నారు. కాగా, ప్రొఫెసర్ కోదండరాంను విద్యావేత్తల కోటాలో, అమీర్ అలీ ఖాన్‌ను జర్నలిస్టుల కోటాలో మండలి సభ్యులుగా ప్రభుత్వం సిఫారసు చేసింది. ఈ ప్రతిపాదనకు గవర్నర్ ఆమోదం తెలుపడంతో.. శుక్రవారం నాడు ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకార చేశారు. ఆయనతో పాటు సియాసత్ ఉర్దూ దిన పత్రిక అసిస్టెంట్ ఎడిటర్ మీర్ ఆమేర్ అలీఖాన్‌ను కూడా సభ్యుడిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆమోదించారు. గవర్నర్ కార్యాలయం గురువారం ఈ మేరకు ప్రకటన చేసింది. ప్రొఫెసర్ కోదండరాంను విద్యావేత్తల కోటాలో, ఆమేర్ అలీఖాన్‌ను జర్నలిస్టుల కోటాలో మండలి సభ్యులుగా ప్రభుత్వం సిఫారసు చేసింది. గత ప్రభుత్వం దాసోజు శ్రావణ్, కుర్రా సత్యనారాయణలను గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా సిఫారసు చేయగా..వారి రాజకీయ నేపథ్యం కారణంగా ఆ ప్రతిపాదనను తమిళిసై తిరస్కరించిన విషయం విదితమే. ప్రస్తుతం వీరి స్థానంలోనే కోదండరాం, మీర్ ఆమేర్ అలీ ఖాన్‌ను నియమించారు.

# మెట్రో వద్ద ఫ్రీపార్కింగ్ ఎత్తివేత.. ప్రయాణికుల ఆగ్రహం

హైదరాబాద్ : నాగోల్, మియాపూర్ మెట్రో స్టేషన్ వద్ద ఫ్రీ పార్కింగ్ ఎత్తివేతపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద ఆగస్టు 25 నుంచి పార్కింగ్ ఫీజు వసూలు చేయనున్నారు. మియాపూర్ మెట్రో స్టేషన్ వద్ద సెప్టెంబర్ ఒకటి నుంచి పార్కింగ్ ఛార్జ్ చేయనున్నారు. అయితే గత ఏడేళ్లుగా ఫ్రీ పార్కింగ్ ఇచ్చి ప్రస్తుతం పెయిడ్ పార్కింగ్ పెట్టడంపై ప్రయాణికులు మండిపడ్డారు. మెట్రో టికెట్ కంటే పార్కింగ్ ఫీజు ఎక్కువ అవుతుందని ప్రయాణికుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్కింగ్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా.. రెండు రోజుల క్రితం నాగోల్ మెట్రోస్టేషన్ వద్ద ప్రయాణికులు ఆందోళనకు దిగారు. ఇప్పటివరకు నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద ఉన్న వాహనాల ఉచిత పార్కింగ్ సదుపాయాన్ని ఎత్తేస్తూ నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 14 నుంచి వాహనాల పార్కింగ్‌కు నిర్ణీత నగదు చెల్లించాలంటూ మెట్రో ప్రీపెయిడ్ పార్కింగ్ బోర్డును అధికారులు ఏర్పాటు చేశారు. ద్విచక్రవాహనాన్ని 2 గంటలు పార్కింగ్ చేస్తే రూ.10, అలాగే 8 గంటల పాటు చేస్తే రూ.25 చెల్లించాలి. 12 గంటలపాటు పార్క్ చేయాల్సి వస్తే రూ.40కట్టాలి. పార్కింగ్ చేసేందుకు వెళ్లిన మెట్రో ప్రయాణికులు ప్రీపెయిడ్ పార్కింగ్ బోర్డు చూసి అవాక్కయ్యారు. దీంతో అందరూ ఒక్కసారిగా నాగోల్ మెట్రో స్టేషన్‌లో ఆందోళనకు దిగారు. ఎప్పటిలాగే ఉచిత పార్కింగ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అరకొర జీతాలతో జూబ్లీహిల్స్, మాదాపూర్ ప్రాంతాల్లో ఉండలేక నాగోల్, ఎల్బీ నగర్ ప్రాంతాల్లో ఉంటున్నామని, ఛార్జీలు కాకుండా అదనంగా పార్కింగ్ ఫీజు చెల్లించాలంటూ మెట్రో కొత్త రూల్స్ తీసుకురావడం దారుణం అని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ వంటి ప్రాంతాలకు వెళ్లేవారు రోజుకు రూ.40 అంటే నెలకు రూ.1200 వందలు చెల్లించాలని, దీని వల్ల తమ కుటుంబాలపై ఆర్థిక భారం పడుతుందని వారు వాపోయారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com